శనివారం
12-10-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 112
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పాక్‌లో 20 మంది గని కార్మికుల కాల్చివేత

బెలూచిస్థాన్: పాకిస్థాన్‌లో సాయుధులు రెచ్చిపోయారు. బొగ్గు గనిలో పనిచేసే 20 మంది కార్మికులను కాల్చి చంపారు. ఈ ఘటన బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో శుక్రవారం జరిగింది. దికీ జిల్లా గనికి సంబంధించిన వసతి గృహాల్లోకి సాయుధులు చొరబడి కాల్పులు జరిపారని, 20 మంది చనిపోగా, మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. మృతుల్లో ముగ్గురు, గాయపడిన వారిలో నలుగురు ఆఫ్ఘాన్లు ఉండగా మిగతా వారు బలూచిస్థాన్‌లోని పష్తున్ వాస్తవ్యులని తెలిసిందని వెల్లడించారు.

సర్కారుపై కాసుల వర్షం

- మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు
- 3,396 షాపులకు 87,116 వేల టెండర్లు
- అంచనాలకు మించి ఖజానాకు రూ.1,750 కోట్ల ఆదాయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్ర ప్రభుత్వానికి దసరా కానుకగా ఎక్సైజ్ శాఖ కాసుల వర్షం కురిపించింది. రాష్ట్ర వ్యాప్తంగా 3,396 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించింది. కొన్ని ప్రాంతాల్లో మినహా కుప్పలు తెప్పలుగా టెండర్లు దాఖలు చేశారు. దాదాపు 87,116 వేల దరఖాస్తులు రావడంతో ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.1,750 కోట్ల మేర ఆదాయం లభించింది. షాపుకు రూ.2 లక్షల చొప్పున టెండరు రుసుం చెల్లించాల్సి ఉండగా, ఈ మొత్తం ప్రభుత్వ ఖజానాకు ఆదాయంగా సమకూరనుంది. అంటే కేవలం మద్యం షాపులకు టెండరు రుసుం ద్వారానే రూ.1,750 కోట్ల ఆదాయం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.1,500 కోట్ల ఆదాయ వస్తుందని అంచనా వేయగా, దానికి మించి షాపులకు టెండర్లు దాఖలయ్యాయి. తొలుత ఈనెల 9వ తేదీ చివరి తేదీగా నిర్ణయించారు. కానీ అనుకున్న మేర దరఖాస్తులు దాఖలు కాకపోవడంతో రెండు రోజులు పొడిగించారు. దానిప్రకారం మద్యం దుకాణాల

- మిగతా 2 లో

నోయెల్‌కే పగ్గాలు

టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా నియామకం

ముంబై: పారిశ్రామిక దిగ్గజం, టాటా ట్రస్ట్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటా వారసుడిగా ఆయన సోదరుడు నోయెల్ టాటా నియమితులయ్యారు. నోయల్ టాటా (67) ఉత్తరాధికారిగా ఈ సంస్థ బాధ్యతలు చేపట్టాలని శుక్రవారం జరిగిన బోర్డు సమావేశం నిర్ణయించింది. టాటా ట్రస్ట్స్‌కు టాటా సన్స్‌లో 66 శాతం భాగస్వామ్యం ఉన్నది. ఇప్పటివరకు ఆర్భాటాలకు

- మిగతా 2 లో

15న హర్యానా కొత్త ప్రభుత్వం ప్రమాణం

చండీగఢ్: హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడోసారి విజయం సాధించిన బీజేపీ కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమవుతోంది. అక్టోబర్ 15వ తేదీన పంచకులలో ప్రమాణ స్వీకారం జరిగే అవకాశం ఉందని పంచకుల డిప్యూటీ కమిషనర్ డాక్టర్ యష్ గార్గ్ తెలిపారు. ప్రమాణ స్వీకారానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు 10 మంది

- మిగతా 2 లో

అంతా సురక్షితం

- ఎయిరిండియా విమానానికి 'ఎమర్జెన్సీ'
- గాల్లోనే రెండు గంటలకు పైగా చక్కర్లు
- ఉత్కంఠ నడుమ సురక్షిత ల్యాండింగ్
- తమిళనాడులోని తిరుచ్చిలో ఘటన

తిరుచ్చి : తమిళనాడు నుంచి షార్జాకు బయలుదేరిన ఎయిరిండియా విమానానికి భారీ ప్రమాదం తప్పింది. విమానం గాల్లో ఉండగా... పైలట్లు ఎమర్జెన్సీ ప్రకటించడం ఒక్కసారిగా కలవరానికి గురిచేసింది. హైడ్రాలిక్ వ్యవస్థ పనిచేయడం లేదని గుర్తించిన పైలట్లు... తిరుచ్చి విమానాశ్రయాన్ని అప్రమత్తం చేశారు. తమిళనాడులోని తిరుచ్చి నుంచి బయలుదేరిన కొద్ది సేపటికే ఈ ఘటన

- మిగతా 2 లో

దసరా... ఊరి బాట

- జాతీయ రహదారులపై వాహనాల క్యూ
- ప్రభుత్వ రవాణా సంస్థ ఆదాయానికి ప్రైవేట్ గండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : దసరా పండుగతో తెలుగు రాష్ట్రాల మధ్య ప్రయాణికుల రద్దీ పెరిగింది. బస్సులు, రైళ్ల ద్వారా అధిక శాతం ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మరికొందరు కార్లు, బైకుల్లో సొంత ఊర్లకు తరలివస్తున్నారు. శనివారం దసరా కావడంతో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరడంతో పాటు టోల్ గేట్ల దగ్గర వాహనాలు గంటల కొద్దీ నిలిచిపోయి ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి నానా అవస్థలకు గురవుతున్నారు. విద్యా సంస్థలకు 12 రోజుల పాటు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించగా... తెలుగు

- మిగతా 2 లో

జపాన్ సంస్థకు నోబెల్ శాంతి బహుమతి

స్టాక్‌హోమ్: ప్రపంచ ప్రఖ్యాత నోబెల్ శాంతి బహుమతి జపాన్‌కు చెందిన నిహాన్ హిడాంక్యో సంస్థను వరించింది. జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిల్లో అణుదాడి నుంచి బయటపడిన బాధితుల పక్షాన ఈ సంస్థ పోరాడుతోంది. ప్రపంచాన్ని అణ్వాయుధ రహితంగా మార్చేందుకు కృషి చేస్తుండటంతోపాటు బాధితుల జీవితగాథలను ఉదహరిస్తూ మరోసారి అణ్వాయుధాలు వాడకుండా ప్రయత్నాలు చేస్తున్నందుకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కింది. 'హిరోషిమా, నాగసాకి అణుబాంబు నుంచి ప్రాణాలతో బయటపడిన వారు శారీరక సమస్యలు, విషాద జ్ఞాపకాలతో జీవిస్తున్నప్పటికీ వారిని గౌరవించాలని భావిస్తున్నాం. శాంతి, విశ్వాసం పెంపొందించడానికి వారి విలువైన అనుభవాలను

- మిగతా 2 లో

మళ్లీ తుపాను ముప్పు

- దక్షిణ బంగాళాఖాతంలో నేడు ఉపరితల ఆవర్తనం
- 16 నాటికి బలపడి తుపానుగా మారే అవకాశం
- దక్షిణ కోస్తా, రాయలసీమకు భారీ వర్ష సూచన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీకి మళ్లీ తుపాను ముప్పు పొంచి ఉంది. దక్షిణ బంగాళాఖాతంలో ఈనెల 12న ఉపరితల ఆవర్తనం ఏర్పడనుందని తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇది 16 నాటికి బలపడి

- మిగతా 2 లో



నేనొస్తే భారత్‌పై ప్రతీకార పన్ను: ట్రంప్

2024 అధ్యక్ష ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే.. భారత్‌పై పరస్పర సమానమైన ప్రతీకార పన్నును విధిస్తాను అని ట్రంప్ తేల్చిచెప్పారు.

2లో

కాంగ్రెస్ వైఫల్యంతోనే

హర్యానాలో ఓటమి

- జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం
- లడ్డూ పేరుతో రాజకీయం తగదు
- మద్యం ఆదాయ వనరుగా భావించడం తప్పు
- విశాఖ ఉక్కు రక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

2లో

సహకారం పెంచుకుందాం

రష్యా, ఇరాన్ అధ్యక్షుల నిర్ణయం

తుర్కమెనిస్థాన్‌లో పెజిష్కియాన్‌తో పుతిన్ భేటీ

మాస్కో: ఇజ్రాయిల్ భూతల, వైమానిక దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లిపోతోంది. భీకర పోరు జరుగుతున్న వేళ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్‌తో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇద్దరు అధినేతలు తుర్కమెనిస్థాన్ రాజధాని అష్గాబత్‌లో శుక్రవారం సమావేశమయ్యారు. అంతర్జాతీయ వ్యవహారాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. ఆర్థిక సంబంధాలు, సాన్నిహిత్యం పెంచుకోవాలని, సహకార బంధాన్ని బలపర్చుకోవాలని సంకల్పించారు. ఉక్రెయిన్‌లో రష్యా పోరు కారణంగా వాషింగ్టన్, యూరోపియన్ యూనియన్‌తో చెడిన సంబంధాల క్రమంలో అమెరికా తీరుపై ఇద్దరు అధినేతలు చర్చించారు. ఈనెల 22-24 తేదీల్లో కజన్‌లో బ్రిక్స్ సదస్సుకు రష్యా ఆతిథ్యమివ్వనున్నది. దీంతో తమ దేశానికి రావాలంటూ పుతిన్ ఆహ్వానించగా పెజిష్కియాన్ అంగీకరించారు. ఆర్థికంగా, సాంస్కృతికంగా తమ మధ్య పటిష్ఠ బంధం ఉన్నదని, దానిని మరింత బలోపేతం చేసుకోవాలని పుతిన్‌తో పెజిష్కియాన్ చెప్పినట్లు అధికారిక ఐఆర్ఎన్ఏ వార్తా సంస్థ తెలిపింది. 'న్యూ వరల్డ్ ఆర్డర్' ఆవిర్భవిస్తోందని పుతిన్ అన్నారు. అన్ని క్షేత్రాల్లో ఇరాన్‌తో సహకారాన్ని రష్యా పెంచుకుంటున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో క్రియాశీలంగా కలిసి ముందుకెళుతున్నాం. ప్రస్తుత పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాం అని పుతిన్ అన్నట్లు టాస్ వార్తా సంస్థ వెల్లడించింది. మిగతా దేశాల కంటే తమ మధ్య సాన్నిహిత్యం ఉందని పెజిష్కియాన్‌తో పుతిన్ అన్నారు. పెజిష్కియాన్ మాట్లాడుతూ అమాయకుల రక్తపాతాన్ని ఇజ్రాయిల్ ఆపాలని, పశ్చిమాసియాలో మారణహోమానికి అమెరికా, ఈయూ మద్దతిస్తున్నాయని అన్నారు. దీంతో ఇజ్రాయిల్ తీరు తప్పుపడుతూ ఆత్మరక్షణ నెపంతో పౌర క్షేత్రాలపై బాంబుల వర్షం కురిపిస్తోందని పుతిన్ విమర్శించారు. ఇటీవల రష్యా విదేశాంగ మంత్రి ఇరాన్‌లో పర్యటించారు. సాయుధ పోరాటాల వేళ తమ మైత్రిని ఈ రెండు దేశాలు పెంపొందించుకుంటున్నాయి.

ట్రంప్‌తో అమెరికాకు మంచి జరగదు

కమలా హారిస్ ప్రచార సభలో ఒబామా



పెన్సిల్వేనియా: అమెరికా అధ్యక్ష ఎన్నికలకు రోజులు సమీపిస్తుండటంతో డెమొక్రటిక్, రిపబ్లికన్ పార్టీల తరఫున పోటీ చేస్తున్న కమలా హారిస్, డొనాల్డ్ ట్రంప్ తమ ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు. ఇదే క్రమంలో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా మద్దతు ప్రకటించారు. తాజాగా పెన్సిల్వేనియాలో జరిగిన కమలా హారిస్ ప్రచార సభలో పాల్గొన్న ఆయన ట్రంప్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ట్రంప్‌తో అమెరికాకు మంచి జరుగుతుందన్న నమ్మకం తనకు లేదని చెప్పారు. ఆయనకు తన అహం, డబ్బు ముఖ్యమని, ప్రజా శ్రేయస్సు పట్టదని విమర్శించారు. ట్రంప్ వస్తే మేలు జరుగుతుందని అనుకుంటే పొరపాటే అవుతుందని, మీ జీవితాలను మెరుపర్చే వ్యక్తిని ఎన్నుకోండి అని ఓటర్లకు ఒబామా పిలుపునిచ్చారు.

నేనొస్తే భారత్‌పై ప్రతీకార పన్ను: ట్రంప్

వాషింగ్టన్: భారత్ అత్యధికంగా పన్నులు విధిస్తోందని, తాను అధికారంలోకి వస్తే ఆ దేశం నుంచి దిగుమతయ్యే వస్తువులపై పన్ను విధిస్తానని రిపబ్లికన్ పార్టీ తరఫు అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అన్నారు. 'మన ఉత్పత్తులకు భారత్ 200 శాతం పన్నులు వసూలు చేస్తుంటే మనం మాత్రం వారి ఉత్పత్తులకు సుంకాలు విధించకూడదా... మనం పన్నులు కడితే.. వారి నుంచి కూడా వసూలు చేయాల్సిందే. 2024 అధ్యక్ష ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే.. భారత్‌పై పరస్పర సమానమైన ప్రతీకార పన్నును విధిస్తాను' అని ట్రంప్ తేల్చిచెప్పారు. అమెరికా వస్తువులపై చైనా 200 శాతం సుంకం విధిస్తోందని, బ్రెజిల్ టారిఫ్‌లు అలాగే ఉన్నాయన్నారు. అన్నింటికంటే భారత్ అత్యధికంగా సుంకాలు వసూలుచేస్తోందని ఆయన తెలిపారు. 'రెసిప్రొసిటీ (పరస్పర ప్రయోజనం కోసం వస్తువులను మార్పిడి చేసుకోవడం).. అమెరికాను మళ్లీ అసాధారణ స్థాయిలో సుసంపన్నంగా మార్చాలనే తన ప్రణాళికలో ముఖ్యాంశంగా తెలిపారు. భారత్‌తో మంచి సంబంధాలున్నాయని చెప్పుకొచ్చారు. ఇంధన ధరల గురించీ ఎక్స్ వేదికగా ట్రంప్ స్పందించారు. 'రానున్న 12 నెలల్లో ఎనర్జీ, ఎలక్ట్రిసిటీ ధరలను సగానికి తగ్గిస్తా. విద్యుత్ సామర్థ్యాన్ని రెట్టింపు చేసే చర్యలు తీసుకుంటా. దాంతో ద్రవ్యోల్బణం తగ్గుతుంది. ఫలితంగా అమెరికా మరీ ముఖ్యంగా మిచిగాన్‌లో వ్యాపార అవకాశాలు పెరుగుతాయి' అని పేర్కొన్నారు. 2019లో ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో భారత్‌ను ఆయన 'టారిఫ్ కింగ్'గా వ్యవహరించారు. భారత్‌కు జీఎస్‌పీని కూడా ఆయన రద్దు చేశారు.

సీఎంగా ఒమర్ అబ్దుల్లా

సీఎల్‌పీ నిర్ణయం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) పార్టీకి కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. ఉమ్మడి సీఎంగా ఒమర్ అబ్దుల్లాకు అంగీకారం తెలిపింది. ఈ మేరకు శ్రీనగర్‌లో జరిగిన సీఎల్‌పీ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఎన్‌సీకి మద్దతు తెలిపే లేఖలపై జమ్మూకశ్మీర్ పీసీసీ తారీక్ హమీద్ కర్రాతో సహా ఆరుగురు శాసనసభ్యులు సంతకాలు చేశారు. నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు డాక్టర్ ఫరూఖ్ అబ్దుల్లాను రాజ్యసభకు నామినేట్ చేసేందుకూ అంగీకారం కుదిరింది.నేషనల్ కాన్ఫరెన్స్ శనివారం రాజ్‌భవన్‌కు వెళ్లి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు తేదీని ఖరారు చేసుకోనున్నది. సీఎల్‌పీ అనంతరం తారీక్ హమీద్ మాట్లాడుతూ ఇండియా ఐక్య సంఘటన స్ఫూర్తితో జమ్మూకశ్మీర్ ప్రజల కోసం నేషనల్ కాన్ఫరెన్స్‌కు మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. 'నేషనల్ కాన్ఫరెన్స్‌కు మద్దతు తెలుపుతూ లేఖను అధికారికంగా అందజేస్తాం. ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లాను అంగీకరిస్తున్నాం' అని చెప్పారు. మంత్రిత్వశాఖల కేటాయింపు విషయంలో విభేదాలు లేవన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత శాఖలపై కూటమి పెద్దలు నిర్ణయిస్తారని తెలిపారు. ప్రస్తుతానికి ఎలాంటి డిమాండ్లు లేవన్నారు. ప్రభుత్వ నమూనాపై చర్చిస్తామని చెప్పారు. మంత్రిత్వశాఖలకు, సంఖ్యా క్రీడకు అతీతంగా పాన్ ఇండియా స్ఫూర్తితో ఈ కూటమి పనిచేస్తోందని తెలిపారు. 90 మంది సభ్యులు ఉన్న జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో 'ఇండియా'కు 54 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు డాక్టర్ ఫరూఖ్ అబ్దుల్లాను రాజ్యసభకు పంపాలని కూడా అంగీకారం కుదిరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఫరూఖ్ అబ్దుల్లా మాట్లాడుతూ 'మనం విద్వేషాన్ని రూపుమాపాలి. జమ్మూలో రాళ్ల దాడులు, ఉగ్రవాదం మొదలవుతుందన్న తప్పుడు ప్రచారాలకు చెక్ పెట్టాలి. ప్రశాంతంగా జీవించాలనుకుంటున్నాం. కొత్త ప్రభుత్వం పనిచేసేందుకు వీలుగా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరుతున్నాం. జమ్మూకశ్మీర్ భారతదేశానికి కిరీటంలాంటిది. కిరీటం వెన్న కోల్పోతే దేశం ఎలా మెరవగలదు' అని ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు.

భారత్‌లో ఆకలి కేకలు

న్యూఢిల్లీ: పేదలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయడం ద్వారా ఆకలి తీరుస్తున్నామని, పౌష్టికాహార లోపాన్ని అరికడుతున్నామని మోదీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ... ప్రపంచ ఆకలి సూచీలో భారతదేశ స్థానంలో పెద్దగా మెరుగుదల కనిపించడం లేదు. పొరుగు దేశాలైన శ్రీలంక, నేపాల్, మైన్మార్, బంగ్లాదేశ్ కంటే అధ్వాన్న పరిస్థితిలో భారత్ ఉంది. పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ కంటే కాస్త మెరుగైన ర్యాంకు పొందగలిగింది. ఇప్పటికే భారత్ ఆర్థిక వ్యవస్థ ఐదో స్థానంలో ఉందని, త్వరలో మూడో స్థానానికి చేరుకుంటామని ప్రధాని మోదీ పదేపదే చెబుతున్నారు. వాస్తవ పరిస్థితులు చూస్తే దీనికి భిన్నంగా కనిపిస్తున్నాయి. మొత్తం 127 దేశాల పరిస్థితులను అధ్యయనం చేసిన 19వ ప్రపంచ ఆకలి సూచీ (జీహెచ్ఐ)-2024 వెలువడింది. దీని ప్రకారం భారత్ 105వ స్థానంలో నిలిచింది. 'కన్‌సర్న్ వరల్డ్ వైడ్, 'వెల్ట్‌హంగర్‌హైల్ఫే'సంయుక్తంగా జీహెచ్ఐ సిరీస్ ప్రచురించాయి. అత్యవసర చర్యలు అవసరమైన ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించాయి. 2024లో భారత్ స్కోరు 27.3గా ఉండగా తీవ్రమైన ఆకలి పరిస్థితికి అద్దం పడుతోంది. ఇటీవల కాలంలో భారతదేశంలో పౌష్టికాహార లోపం కాస్త పెరిగినట్లు తాజా నివేదిక సూచిస్తోంది. గతేడాది ఆకలి సూచీ ప్రకారం 125 దేశాల్లో భారత్ 111వ స్థానంలో నిలిచింది. ఇప్పుడు 127 దేశాల అధ్యయనంలో 105వ ర్యాంకు పొందింది. అయితే 2024లో జీహెచ్ఐ స్కోరు 2016 స్కోరు (29.3) కంటే కాస్త మెరుగైంది కానీ నేటికీ ప్రమాదకర స్థాయిలోనే ఉంది. పిల్లల్లో తీవ్రమైన పౌష్టికాహార లోపం, ఎదుగుదల లోపం వంటి సవాళ్లను అధిగమించలేకపోతోంది. ఐదేళ్ల లోపు పిల్లల్లో మరణాల రేటు 2.9 శాతంగా ఉంది. పౌష్టికాహార లోపం రేటు 13.7 శాతంగా, ఎదుగుదల లేమి 35.5 శాతంగా ఉన్నాయి. 2016 నుంచి ఆకలి తీర్చే చర్యల్లో అంతర్జాతీయ స్థాయి ప్రతిష్ఠంభన ఉన్నట్లు జీహెచ్ఐ-2024 తెలిపింది. తాజా ఫలితం దృష్ట్యా 2030 నాటికి ఆకలి రహిత భారత్ (జీరో హంగర్) లక్ష్యం సుదూర కలగా మారింది. ఆకలి సూచీ ప్రకారం 127కుగాను 42 దేశాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నాయని, పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉన్నదని స్పష్టమైంది. ఆకలికి, వాతావరణ మార్పునకు, లింగ అసమానత్వానికి మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని ఈ నివేదిక సూచిస్తోంది. వివక్ష, లింగాధారిత హింస వంటివి మహిళలు ముఖ్యంగా లింగపరమైన మైనారిటీలకు ఆహారం, పౌష్టికాహారపరమైన అభద్రతకు గురి చేస్తున్నాయని, వాతావరణ మార్పుల ప్రభావంతో ఆయా సవాళ్లు ఎదుర్కొనేందుకు వారిలోని సామర్థ్యం దెబ్బతింటోందని తాజా నివేదిక వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో మెరుగుదలకు చర్యలు అవసరమని ప్రపంచ దేశాలకు సూచించింది.

నోయెల్‌కే పగ్గాలు

(మొదటిపేజీ తరువాయి)

దూరంగా తెర వెనుక ఉండి పని చేసిన నోయల్ టాటా... దోరాబ్జీ టాటా ట్రస్ట్‌కు 11వ చైర్మన్‌గా, రతన్ టాటా ట్రస్ట్‌కు ఆరవ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. రతన్ టాటా సవితి తల్లి సిమోన్ ఎన్ టాటా కుమారుడే నోయెల్ టాటా. ట్రెంట్, టాటా ఇంటర్నేషనల్ లిమిటెడ్, వోల్టాస్ లిమిటెడ్ సహా టాటా కంపెనీల్లోని సంస్థలకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. టాటా స్టీల్, టైటాన్‌కు వైస్ చైర్మన్‌గా, రతన్ టాటా ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా ఉన్నారు.

ఆయన ప్రస్థానం ఇలా...

నోయెల్ టాటా ఆర్భాటాలకు దూరంగా తన పని తాను చేసుకుపోతారు. నోయెల్ బ్రిటన్‌లోని సుసెక్స్ యూనివర్సిటీ నుంచి పట్టభద్రులయ్యారు. ఇన్‌సీడ్ నుంచి ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ (ఐఈపీ) చేశారు. 2000 దశకం ఆరంభంలో ఆయన టాటా గ్రూపులో చేరారు. దాని విస్తరణలో ముఖ్యభూమిక పోషించారు. ఇటీవల కాలంలో మరింత కీలకపాత్రల్లో కనిపించారు. 2018లో టైటాన్ వైస్ చైర్మన్‌గా, 2022లో టాటా స్టీల్ వైస్‌చైర్మన్‌గా నియమితులయ్యారు. 2019లో సర్ రతన్ టాటా ట్రస్ట్ బోర్డులో చేరారు. టాటా ఇంటర్నేషనల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆ సంస్థను వృద్ధి చేశారు. 2010-21లో కంపెనీ టర్నోవర్‌ను 500 మిలియన్ డాలర్ల నుంచి మూడు బిలియన్ డాలర్లకు పెంచడంలో సహాయపడ్డారు. టాటా రిటైల్ వ్యాపారాలను చూస్తే ట్రెంట్ సంస్థకు 1998లో ఒక బ్రాంచ్ మాత్రమే ఉండేది. కానీ నోయెల్ బాధ్యతలు చేపట్టిన తర్వాత అది వేగంగా విస్తరించింది.

ప్రస్తుతం దీనికి 700 శాఖలు ఉన్నాయి. లిటిల్ ఉడ్స్‌ను కొనుగోలు చేసి వెస్ట్‌సైడ్‌గా మార్చింది. నోయెల్ టాటా ఆస్తి విలువ సుమారు రూ.12,400 కోట్లు. నోయెల్ భార్య ఆలూ పల్లోంజీ మిస్త్రీ కుమార్తె. టాటా గ్రూప్‌లో ఆమె కుటుంబానికి వాటాలు ఉన్నాయి. ఈ దంపతులకు లేహ, మాయా, నెవిల్లే బిడ్డలు. వీరు ఈ ఏడాదిలోనే సర్ రతన్ టాటా, సర్ దోరాబ్జీ టాటా ట్రస్టుల పరిధిలోని వివిధ ట్రస్టుల ట్రస్టీలయ్యారు. ఇండియన్ హోటల్స్‌కు ఉపాధ్యక్ష పదవిలో లేహ ఉండగా, ట్రెంట్, స్టార్ బజర్ లీడర్‌షిప్ టీమ్‌లో మాయా ఉన్నారు. స్టార్‌బజార్, జుడియోను నెవిల్లే పర్యవేక్షిస్తున్నారు. కిర్లోస్కర్ కుటుంబానికి చెందిన మానసిని నెవిల్లే వివాహం చేసుకున్నారు. రతన్ టాటాకు సిమోనె సవతి తల్లి అయినా వారి మధ్య ప్రేమానుబంధాలు ఉన్నాయి. పని, కుటుంబ విలువలు నేర్చుకోవడంలో ఆమె పాత్ర ఉన్నట్లు రతన్ టాటా అనేకసార్లు చెప్పారు.

కాంగ్రెస్ వైఫల్యంతోనే హర్యానాలో ఓటమి

విశాలాంధ్ర-గూడూరు: హర్యానాలో ఓటమి కాంగ్రెస్ వైఫల్యం తప్ప... ఇండియా ఐక్య సంఘటనది కాదని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ తెలిపారు. గూడూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో మోదీ గ్రాఫ్ పడిపోయిందని, మోదీ వలన బీజేపీకి నష్టం వస్తుందని, పీఎంవో కార్యాలయానికి, ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి మధ్య అంతరం పెరిగిందని అన్నారు. ఇటీవల జరిగిన హర్యానా ఎన్నికల్లో గెలుస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ధీమా వ్యక్తం చేసిందని, అయితే అంచనాలు తారుమారు కావడంతో బీజేపీ విజయం సాధించిందని నారాయణ తెలిపారు. కాంగ్రెస్ ఒంటెత్తు పోకడ కారణంగానే ఓడిపోయిందని, అన్ని స్థానాలు తానే గెలవాలన్న తాపత్రయంతో మిత్రపక్షాలను పట్టించుకోకుండా అనాలోచిత నిర్ణయాలు తీసుకుందని, ఇది ఇండియా ఐక్య సంఘటన ఓటమి కాదని స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్‌లో 'ఇండియా' కూటమి విజయం శుభపరిణామమని అన్నారు. ఈ ఫలితాలు చూస్తుంటే ఎన్‌డీఏ కూటమి దేశంలో మనుగడ సాగించడం కష్టమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో వ్యవహరించాలన్నారు. ఇండియా ఐక్య సంఘటన త్వరలో జరిగే రాష్ట్రాల ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఓటమి చెందిన పార్టీలను కలుపుకొనిపోవాలని నారాయణ సూచించారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ తీసుకువస్తున్న జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజాస్వామ్యానికి తీవ్ర ప్రమాదమన్నారు. జమిలి ఎన్నికలకు ఎన్‌డీఏ కూటమిలో భాగమైన సీఎం చంద్రబాబు మద్దతు పలుకుతూ భుజాన మోస్తున్నారని విమర్శించారు. ఆయా రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోకుండా ఎన్‌డీఏ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం సబబు కాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేసి... ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సీఎం చంద్రబాబు నాణ్యమైన మద్యాన్ని సరసమైన ధరలకు ఇస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మద్యం పాలసీ ద్వారా రూ.3 వేల కోట్లు వస్తుందని, దీనిని రాష్ట్ర ప్రభుత్వం ఆదాయ వనరుగా పరిగణించడం తప్పు అని అన్నారు.

రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష నాయకులు ఒక్కటై మద్యంలో సిండికేట్‌గా వ్యవహరించి జేబులు నింపుకునేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. కొత్త సీసాలో పాత సారా అన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు పేదల అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన హితవు పలికారు. సనాతన ధర్మం లౌకికవాదానికి వ్యతిరేకమన్నారు. తిరుమల లడ్డూ తయారీలో అవినీతి... సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. లడ్డూ పేరుతో రాజకీయం చేయడం తగదన్నారు. తెలంగాణ మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు బాధాకరమని అన్నారు. రాజకీయ నాయకులు హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం జిల్లాకో విమానాశ్రయం పేరుతో రైతుల వద్ద భూములు సేకరించి, మౌలిక సదుపాయాల పేరుతో కార్పొరేట్లకు ఆ భూములు దోచిపెడుతోందని విమర్శించారు. బ్యాలెట్ పేపర్ పద్ధతిలో 127 దేశాలు ఎన్నికలు నిర్వహిస్తున్నాయన్నారు. బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు జరపాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటోందని, దానికి తమ మద్దతు ఉంటుందని నారాయణ తెలిపారు. విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసి ప్రైవేటీకరణ చేస్తుంటే చంద్రబాబు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, పట్టణ కార్యదర్శి కాలేషా తదితరులు పాల్గొన్నారు.

అంతా సురక్షితం

(మొదటిపేజీ తరువాయి)

చోటుచేసుకుంది. దీంతో తిరుచ్చి విమానాశ్రయంలో ల్యాండింగ్ కోసం ఏర్పాట్లు చేయడంతో రాత్రి 8 గంటల తర్వాత ఉత్కంఠ పరిస్థితుల మధ్య సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. ప్రయాణికులంతా సురక్షితంగా ఉండటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎయిరిండియా విమానం ఏఎక్స్‌బి 613 తిరుచ్చి నుంచి షార్జాకు శుక్రవారం సాయంత్రం 5.40 గంటలకు బయలుదేరింది. ఆ సమయంలో విమానంలో 141 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. టేకాఫ్ అయిన కొద్ది సేపటికే హైడ్రాలిక్ వ్యవస్థ విఫలమైనట్లు పైలట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఏటీసీకి తెలియజేయడంతో అప్రమత్తమైన అధికారులు... అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతిచ్చారు. అయితే విమానం సురక్షిత ల్యాండింగ్ కావాలంటే అందులో ఉన్న ఇంధనం నిర్దేశిత స్థాయి వరకు తగ్గాల్సి ఉంటుంది. దీంతో సురక్షిత ల్యాండింగ్ కోసం ప్రయత్నించిన పైలట్లు... దాదాపు రెండు గంటల పాటు విమానాన్ని గాల్లోనే చక్కర్లు కొట్టించారు. దీంతో ప్రయాణికుల భద్రతపై తీవ్ర ఆందోళన నెలకొంది. ఇదే సమయంలో ఏదైనా ప్రతికూల పరిస్థితి ఏర్పడితే ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు ముందస్తు ఏర్పాట్లను సైతం చేశారు. 20 అంబులెన్సులు, 20 అగ్నిమాపక యంత్రాలతోపాటు పారామెడికల్ సిబ్బందిని విమానాశ్రయంలో సిద్ధంగా ఉంచారు. అయితే ఎట్టకేలకు హైడ్రాలిక్ గేర్ పనిచేయడంతో విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. ప్రయాణికులు, అధికారులు, ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఈ సందర్భంగా పైలట్లకు ప్రయాణికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పైలట్లను తమిళనాడు సీఎం ఎం.కె.స్టాలిన్ అభినందించారు.

మళ్లీ తుపాను ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

తుపానుగా మారవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే దీని ప్రభావం తమిళనాడు, దక్షిణ కోస్తా జిల్లాలపై ఉండే సూచనలున్నాయని తెలిపారు. నైరుతి రుతుపవనాల ఉపసంహరణ మొదలైన క్రమంలో ఈశాన్య రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. వాస్తవానికి ఏటా అక్టోబరు 20న ఈశాన్య రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకుతుంటాయి. ఈసారి చురుగ్గా ముందుకు కదులుతుండటంతో 15 నాటికి దక్షిణ కోస్తాలోకి వచ్చే అవకాశాలున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

వెల్లడించారు. ప్రస్తుతం కేరళ, తమిళనాడు మీదుగా నైరుతి బంగాళాఖాతంలో సముద్ర మట్టానికి 4.5 కి.మీ. ఎత్తులో ఉపరితల ద్రోణి కొనసాగుతోందని వెల్లడించారు.

దసరా... ఊరి బాట

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాల ప్రజలు అటూ, ఇటూ వెళ్లారు. ప్రభుత్వ కార్యాలయాలకూ సెలవులు ఇచ్చారు. విజయవాడ బస్‌స్టేషన్, రైల్వే స్టేషన్లు కిక్కిరిసిపోయాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఏపీఎస్ఆర్టీసీ, దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక బస్సులు, రైళ్లను నడుపుతున్నాయి. ఇదే సమయంలో ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు ప్రయాణికుల నుంచి నిలువు దోపిడీకి పాల్పడుతున్నాయి. ఏపీఎస్ఆర్టీసీ 6,100 ప్రత్యేక బస్సులను రెండు దశల్లో కేటాయించింది. తొలివిడత విజయవాడ నుంచి వివిధ ప్రాంతాలకు నడిచే 3,060 ప్రత్యేక బస్సులు శుక్రవారం నాటితో నిలిచిపోతాయి. ఇతర ప్రాంతాల నుంచి తిరుగు ప్రయాణం కోసం ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు మరో 3,040 బస్సులు రోడ్డెక్కనున్నాయి. ఏపీఎస్ఆర్టీసీ ఆర్టీసీ ద్వారా హైదరాబాద్ నుంచి 990, బెంగళూరు నుంచి 275, చెన్నయ్ నుంచి 65 బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. విజయవాడ నుంచి 400, విశాఖ నుంచి 320, రాజమహేంద్రవరం నుంచి 260... మిగిలిన జిల్లాల నుంచి 730 ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు చెన్నయ్, హైదరాబాద్, బెంగుళూరు తదితర రాష్ట్రాలకు ఆర్టీసీ బస్సులు రాకపోకలు చేసేలా ప్రణాళిక రూపొందించారు. ప్రయాణికులకు అనువుగా ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. దక్షిణ మధ్య రైల్వే 1,400 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. అయితే ఆయా ప్రత్యేక బస్సులు, రైళ్లలో రిజర్వేషన్ల బెర్తులు లభించని వారంతా ప్రైవేట్ బస్సులను ఆశ్రయిస్తున్నారు.

ప్రైవేట్ యాజమాన్యం దోపిడీ

ఏపీఎస్ఆర్టీసీ ఆదాయానికి ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యం గండికొడుతోంది. సాధారణ చార్జీలతోనే వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుండగా... ప్రైవేట్ యాజమాన్యం ప్రయాణికులను నిలువు దోపిడీకి పాల్పడుతోంది. మూడు రెట్ల మేర టికెట్ ధరలను పెంచి వసూలు చేస్తున్నాయి. ఆర్టీసీ, రైళ్లలో సీట్లు దక్కని వారంతా ప్రైవేట్ బస్సులను ఆశ్రయించడంతో ఈ దుస్థితి ఏర్పడింది. విజయవాడ నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్, విశాఖ, తిరుపతి తదితర నగరాలకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి విజయవాడ, విజయవాడ నుంచి విశాఖకు నడిచే పేరొందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల నిర్వాహకులు ఈ దోపిడీకి పాల్పడుతున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. ఏసీ బస్సుల్లో సగటున ఒక్కో సీటుకు రూ.1,500, నాన్ ఏసీ బస్సుల్లో రూ.1,000 చొప్పున టికెట్ల ధరలను విపరీతంగా పెంచి దండుకుంటున్నారు. రాష్ట్రంలో 1,200 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులున్నాయి. ఇవి తెలుగు రాష్ట్రాల్లో రాకపోకలు సాగిస్తున్నాయి. విజయవాడ నుంచి విశాఖకు ఇదే స్థాయిలో టికెట్ ధరలను పెంచేశారు.

హైదరాబాద్ కేంద్రంగా ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యం ప్రయాణికుల నుంచి భారీగా వసూలు చేస్తున్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు, హైదరాబాద్ నుంచి విశాఖ, తిరుపతికి ఒక్కో బస్సుకు ఒక్కో రకంగా ఇష్టానుసారంగా టికెట్ ధరలను నిర్ధారించి ప్రయాణికుల నుంచి దోపిడీకి పాల్పడుతున్నారు. రవాణా శాఖ అధికారుల తనిఖీలు, ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతోనే ప్రైవేట్ బస్సు టికెట్ల ధరలను విపరీతంగా పెంచేశారన్న విమర్శలున్నాయి.

జపాన్ సంస్థకు నోబెల్ శాంతి బహుమతి

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగించుకునేందుకు శాంతి బహుమతిని ఇవ్వాలని నిర్ణయించాం' అని నోబెల్ బృందం పేర్కొంది. జపాన్ నగరాల్లో అణ్వాయుధాల బారిన పడిన బాధితుల ఉద్యమాన్ని హిబాకుషాగా పేర్కొంటారు. దీనిలో జపాన్‌కు చెందిన 47 రాష్ట్రాల్లో పోరాడుతున్న సంస్థల ప్రతినిధులు ఉన్నారు. మరోవైపు, వైద్య విభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రదానం అక్టోబర్ 14 వరకు కొనసాగనుంది. వైద్య, భౌతిక, రసాయన శాస్త్రాలతోపాటు సాహిత్యంలో నోబెల్ గ్రహీతల పేర్లను ఇప్పటికే వెల్లడించగా... శుక్రవారం నోబెల్ శాంతి బహుమతిని ప్రకటించారు. అక్టోబర్ 14న అర్థశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లు వెల్లడిస్తారు.

సర్కారుపై కాసుల వర్షం

(మొదటిపేజీ తరువాయి)

లైసెన్స్‌లకు సంబంధించి దరఖాస్తు గడువు శుక్రవారం రాత్రి 7 గంటలకు ముగిసింది. ఈ ఒక్కరోజే రికార్డు స్థాయిలో దాదాపు 22 వేల దరఖాస్తులు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లలో వచ్చాయి. దీంతో మొత్తం మద్యం దుకాణాల కోసం దాదాపు 87 వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. దీని ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.1,750 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. దరఖాస్తు గడువు ముగిసినప్పటికీ రాత్రి 12 గంటల్లోపు ధరావత్తు సొమ్ము చెల్లించేందుకు అబ్కారీ శాఖ అవకాశం కల్పించింది. రాష్ట్రంలో అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లాలో 113 షాపులకు 5,764 దరఖాస్తులు రాగా, ఆ తర్వాత 5 వేలకు పైగా వచ్చిన జిల్లాల్లో ఏలూరు 5,339, పశ్చిమ గోదావరి 5,362, విజయనగరం 5,235 జిల్లాలున్నాయి. మద్యం సిండికేట్లను భగ్నం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసినప్పటికీ కొన్ని ప్రాంతాల్లోని షాపులకు పరిమితంగానే దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా 3,396 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించిన ఎక్సైజ్ శాఖ, ఈ నెల 14న లాటరీ ద్వారా దుకాణాలను కేటాయించనుంది. అక్టోబరు 15 నాటికి దుకాణాలను లాటరీలో దక్కించుకున్న ప్రైవేటు వారికి అబ్కారీ శాఖ అప్పగించనుంది. 16వ తేదీ నుంచి రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమల్లోకి రానుంది. ఇక జిల్లాల వారీ మద్యం షాపుల సంఖ్యను బట్టి వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇలా ఉన్నాయి.

జిల్లా	షాపుల సంఖ్య	వచ్చిన దరఖాస్తులు
శ్రీ సత్యసాయి	87	1399
తిరుపతి	227	3659
బాపట	117	2064
అన్నమయ్య	111	2106
ప్రకాశం	171	3397
పల్నాడు	129	2577
నంద్యాల	105	2155
కాకినాడ	155	3204
నెల్లూరు	182	3791
చిత్తూరు	104	2242
అనంతపురం	136	3022
కడప	139	3169
కృష్ణా	123	2810
అనకాపల్లి	136	3178
విశాఖపట్నం	155	3890
పార్వతీపురం మన్యం	52	1375
శ్రీకాకుళం	158	4551
అల్లూరి సీతారామరాజు	40	1179
అంబేద్కర్ కోనసీమ	133	3980
కర్నూలు	99	3007
పశ్చిమ గోదావరి	175	5362
విజయనగరం	153	5235
తూర్పు గోదావరి	125	4289
గుంటూరు	127	4372
ఏలూరు	144	5339
ఎన్టీఆర్ విజయవాడ	113	5764
మొత్తం	**3,396**	**87,116**

15న హర్యానా కొత్త ప్రభుత్వం ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులతో కూడిన కమిటీని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి యష్ గార్గ్ నేతృత్వం వహిస్తున్నారు. హర్యానా కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ అగ్రనేతలు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. గత మార్చిలో మనోహర్ లాల్ ఖట్టర్ స్థానంలో ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన బీజేపీ సీనియర్ నేత నయబ్ సింగ్ సైనీ తిరిగి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలున్నాయి. ఆయన సారథ్యంలోనే బీజేపీ హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లింది. పార్టీ గెలిస్తే సైనీనే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారంటూ ఎన్నికల ప్రచారంలో బీజేపీ సంకేతాలిచ్చింది. హర్యానాలో ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ బీజేపీ మొత్తం 90 సీట్లలో 48 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ 37 సీట్లకే పరిమితమైంది. ఎన్నికల్లో గెలిచిన ముగ్గురు ఇండిపెండెంట్లు ఇప్పటికే బీజేపీకి మద్దతు ప్రకటించారు.

జగన్ తరిమేసిన పరిశ్రమలు తీసుకువస్తాం

మంత్రి నారా లోకేశ్

విశాలాంధ్ర-తాడేపల్లి: రాష్ట్రానికి టీసీఎస్‌ను తానే తీసుకువచ్చినట్లు జగన్ రెడ్డికి ఆత్మ చెప్పిందేమో అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. తాడేపల్లి కొలనుకొండలో సింహా కియా కార్ల షోరూమ్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలోనూ చంద్రబాబు నాయుడు కియా మోటార్స్‌ను ఏపీకి తీసుకువస్తే వైఎస్ రాజశేఖర్ రెడ్డి లేఖ రాశారంటూ మాట్లాడారని అన్నారు. జగన్ పాలనలో ఎన్ని కంపెనీలు తీసుకువచ్చారు... ఎన్ని ఉద్యోగాలు కల్పించారో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సీఎంగా చంద్రబాబు వచ్చిన తర్వాతనే ఏపీలో పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, ఇందులో భాగంగానే టీసీఎస్ వచ్చిందని తెలిపారు. గతంలో జగన్ రెడ్డి తరిమివేసిన పరిశ్రమలన్నీ తీసుకువస్తామని, పరిపాలన వికేంద్రీకరణతో పాటు అభివృద్ధి వికేంద్రీకరణకు కట్టుబడి ఉన్నామని లోకేశ్ స్పష్టం చేశారు. రాయలసీమకు తయారీ యూనిట్లు, సేవల యూనిట్లను ఉత్తరాంధ్రకు తీసుకువస్తామని, విండ్, సోలార్, పంప్ స్టోరేజ్ ప్రాజెక్టులు, సిమెంట్ ఫ్యాక్టరీలు కర్నూలుకు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ కంపెనీలన్నీ కడప, చిత్తూరుకు, ఆటోమొబైల్స్ అనంతపురానికి తీసుకువస్తామని మంత్రి చెప్పారు. ఉభయ గోదావరి జిల్లాలకు ఆక్వా, పెట్రో కెమికల్ పరిశ్రమలను, కృష్ణా, గుంటూరు జిల్లాలకు అనేక పెట్టుబడులు తీసుకువస్తామన్నారు. బ్లూ బుక్, గుడ్ బుక్ అంటున్న వైసీపీ... తనను చూసి స్ఫూర్తి పొందినట్లు ఉందని లోకేశ్ అన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి, ప్రజలను ఇబ్బందిపెట్టిన అధికారులు, వైసీపీ నాయకులపై చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని చెప్పామని, ఇప్పటికే చర్యలు మొదలయ్యాయన్నారు. వరద సాయంపై వైసీపీ దుష్ప్రచారం చేస్తోందన్నారు. దాదాపు 10 రోజులకు పైగా చంద్రబాబు, మంత్రివర్గం మొత్తం ముంపు ప్రాంతాల పనులు పర్యవేక్షించారని తెలిపారు. పునరావాస చర్యలకు రూ.650 కోట్లు ఖర్చు పెట్టినట్లు వివరించారు. లోటుపాట్లు ఉంటే, సాయం అందకపోతే వివరాలు ఇవ్వాలని, తప్పులు సరిదిద్దుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుంటూరులో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణాన్ని, మంగళగిరిలో ఎయిమ్స్‌కు నీటి సరఫరాతో పాటు వంద పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని త్వరలో చేపడతామని మంత్రి తెలిపారు. మూడు నెలల్లో మంగళగిరిలో భూగర్భ డ్రైనేజీ పనులు చేపడతామని, దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారికి పట్టాలు ఇస్తామన్నారు. సనాతన ధర్మ బోర్డు విషయంలో అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వివరించారు. సమావేశంలో మంత్రులు ఎం.రామ్ ప్రసాద్ రెడ్డి, కొలుసు పార్థసారధి, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కామినేని శ్రీనివాసరావు, గద్దె రామ్మోహన్, రాష్ట్ర పద్మశాలి అభివృద్ధి సంస్థ చైర్మన్ నందం అబద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

కియా కార్ల షోరూం ప్రారంభం

కాగా, కొలనుకొండలో ఏర్పాటు చేసిన సింహా కియా షోరూంను నారా లోకేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎం.రామ్‌ప్రసాద్ రెడ్డి, కొలుసు పార్థసారధి, శాసనసభ్యులతోపాటు కియా కంపెనీ సౌత్ ఇండియా రీజనల్ మేనేజర్ జోంగో ర్యూ, సింహా కియా డైరెక్టర్లు రావెళ్ల సుబ్బయ్య, రావెళ్ల సతీష్, ప్రతినిధులు పాల్గొన్నారు. నారా లోకేశ్ మాట్లాడుతూ సింహా కియా మోటార్స్ షోరూమ్ ప్రారంభం ఈ ప్రాంతం అభివృద్ధికి నిదర్శనమన్నారు. రావెళ్ల సతీశ్ మాట్లాడుతూ 2019లో తమ మొదటి కియా షోరూమ్‌ను విజయవాడలో ప్రారంభించామని, అనంతరం గుంటూరు, భీమవరంలోనూ ఏర్పాటు చేశామన్నారు.

వలంటీర్ల సమస్యల పరిష్కారానికి

21న కలెక్టరేట్ల వద్ద నిరసనలు

ఈశ్వరయ్య పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: వలంటీర్లకు న్యాయం కోసం డిమాండ్ చేస్తూ ఈనెల 21న రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద నిరసనలకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ వలంటీర్స్ అసోసియేషన్ (ఏఐవైఎఫ్ అనుబంధం) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. అసోసియేషన్ అధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఈశ్వరయ్య మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన ఏడు కేబినెట్ సమావేశాల్లో వలంటీర్ల గురించి చర్చించకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తామని తెలిపారు. 'చలో సీఎం క్యాంపు కార్యాలయం' చేపడతామని అన్నారు. 21న కలెక్టరేట్ల వద్ద నిరసనల్లో భారీ సంఖ్యలో పాల్గొనాలని వలంటీర్లకు ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు మాట్లాడుతూ వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల ప్రకారం రూ.10వేలు గౌరవ వేతనం ఇవ్వాలని, రాజకీయ ఒత్తిళ్లకి రాజీనామా చేసిన వలంటీర్లు కొనసాగించాలని, నాలుగు నెలల గౌరవ వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ-వార్డు వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని, వలంటీర్ల హాజరు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వాలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామూళ్ల జగదీశ్, కార్యనిర్వాహక కార్యదర్శి లంకా గోవిందరాజులు, ఉపాధ్యక్షులు రాజశ్, సతీశ్, సరోజిని, యామినీ, మమత, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

ఇళ్లు లేని పేదలందరికీ ఐదేళ్లలో శాశ్వత గృహాలు

మంత్రి పార్థసారధి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వచ్చే ఐదేళ్లలో నిరుపేదలందరికీ శాశ్వత గృహ వసతి కల్పించాలని సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారని, ఆ లక్ష్య సాధన దిశగా గృహ నిర్మాణ శాఖ ముందుకు అడుగులు వేస్తున్నదని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. రాష్ట్ర సచివాలయం నాల్గవ బ్లాక్ మొదటి అంతస్తులో ఆధునీకరించబడిన తన ఛాంబర్‌లో మంత్రి పూజలు నిర్వహించి ప్రవేశించారు. ప్రభుత్వానికి సంబంధించిన అన్ని సమావేశాలు, చర్చలు ఈ నూతన ఛాంబర్ నుంచే జరుగుతాయని తెలిపారు. ఎస్సీలకు, బీసీలకు మేమే ఛాంపియన్లు అని చెప్పుకునే గత పాలకుల హయాంలో గృహ నిర్మాణ శాఖలో ఎన్నో అవకతవకలు జరిగాయని, నిరుపేదల గృహ నిర్మాణాలకు కేంద్రం ఇచ్చిన దాదాపు రూ.4,500 కోట్ల నిధులను పక్కదోవ పట్టించారని ఆరోపించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలోనే కాకుండా, ఇంకా వారికి ఏ విధంగా మేలు చేకూర్చగలమనే కోణంలో ఆలోచించి ప్రతిపాదనలు రూపొందించాలని ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు ఆదేశించిన మేరకు తగు చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ కె.రాజబాబు, సమాచార శాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత, సంయుక్త సంచాలకులు పి.కిరణ్ కుమార్, అధికారులు, అనధికారులు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

గోదావరి పుష్కరాలకు రూ.100 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం మరో శుభవార్త తెలిపింది. గోదావరి పుష్కరాలకు రూ.100 కోట్లు కేటాయించింది. 2027లో జరగబోయే పుష్కరాలను పురస్కంచుకుని అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా తూర్పు గోదావరి జిల్లాలకు ఈ నిధులను ప్రభుత్వం వెచ్చించనుంది. గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించే దిశగా చేపట్టే పనులపై దృష్టి పెట్టింది. దీనిపై నివేదిక ఇవ్వాలని మంత్రి నారాయణ ఆదేశించడం విదితమే.

తెలుగువారికి జగన్ దసరా శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దుర్గాష్టమి, మహర్నవమి, విజయ దశమిని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ మాజీ ముఖ్య మంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే పండగ విజయదశమి అని ఆయన ట్వీట్ చేశారు. చెడు ఎంత దుర్మార్గమైనదైనా, ఎంత శక్తిమంతమైనదైనా అంతిమ విజయం మంచినే వరిస్తుందన్నారు. ఆ జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించాలని జగన్ ఆకాంక్షించారు.

శ్రీ సత్యసాయి తాగునీటి పథకం కార్మికుల జీతాలు చెల్లించాలి

డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: శ్రీ సత్య సాయి తాగునీటి పథకం కార్మికులకు తక్షణం జీతాలు చెల్లించాలని పథకం మెయింటెనెన్స్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొయ్యలగూడెం పట్టణంలో శుక్రవారం శ్రీ సత్యసాయి తాగునీటి పథకం కార్మికుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సీపీఐ రాష్ట్ర నాయకులతో కలిసి శ్రీ సత్య సాయి మంచినీటి పథకం కార్మికులకు జీతాలు విడుదల చేయాలని ప్రభుత్వ పెద్దలకు వినతి పత్రం అందించినప్పటికీ స్పందన లేదని, కార్మికులు ఏ క్షణంలోనైనా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మధ్యాహ్నం పథకం కార్మికులను తొలగించడానికి కుట్ర పన్నుతుందని, ఈ పథకం కార్మికులను తొలగించవద్దన్న డిమాండ్‌తో ఏఐటీయూసీ పోరాటం చేస్తోందని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను రద్దు చేసిందని, వలంటీర్లను మరలా విధులలోకి తీసుకుంటామని చంద్రబాబు చేసిన వాగ్దానం అమలు చేయలేదని విమర్శించారు. నూతన మద్యం పాలసీ విధానం ద్వారా మద్యం దుకాణాలలో పని చేసే వేల మంది రోడ్డున పడ్డారని, వారికి ప్రభుత్వం మార్గం చూపాలని డిమాండ్ చేశారు. రతన్ టాటా మృతికి సమావేశంలో కొద్ది నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. కరోనా సమయంలో దేశానికి సహాయ సహకారాలు అందించిన మహోన్నత వ్యక్తి రతన్ టాటా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, శ్రీ సత్యసాయి మంచినీటి పథకం నూతన అధ్యక్షులు జి.శివ సత్యనారాయణ, కార్యదర్శి ఆచంట సత్యనారాయణ, కోశాధికారి పిల్లి నాగ వీరబాబు, బాలాజీ, ప్రసాద్, సతీష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరలకే వంట నూనె విక్రయం: నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతు బజారుల దుకాణాల్లో వంట నూనెలు, ఉల్లి, టమాటాను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. విజయవాడలోని రెండు రైతు బజారులను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విక్రయించే సరుకుల నాణ్యత, ధరలపై ఆరా తీశారు. గురునానక్ కాలనీ, పంటకాలువ రోడ్డులోని రైతు బజార్లలో వంట నూనెలు, ఉల్లి, టమాటా ధరలపై వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. పామాయిల్ లీటరు రూ.110కి, సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.124కు విక్రయించాలని సూచించారు. అందరికీ కనబడేలా బోర్డులు ఉండాలని వ్యాపారులకు ఆదేశించారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ఒకే రకమైన ధరలు అమలు చేయాలని ప్రభుత్వ నిర్ణయించిందన్నారు. ప్రతి రేషన్ కార్డుపై రిఫైండ్ ఆయిల్‌ను గరిష్టంగా రూ.124కు, పామాయిల్‌ను రూ.110కు ఇవ్వాలన్నారు.నాణ్యత లేని ఉత్పత్తులు విక్రయిస్తే ఉపేక్షించబోమని మంత్రి హెచ్చరించారు.

కాకినాడ డీఎఫ్‌ఓపై విచారణకు పవన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాకినాడ డీఎఫ్ఓ రవీంద్రనాథ్ రెడ్డిపై విచారణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. తన పేరు, కార్యాలయం పేరుతో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాకినాడ అటవీ శాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రవీంద్రనాథ్ రెడ్డి మైనింగ్ వాహనాల విషయంలో అనేక ఆంక్షలు విధించారు. పవన్ కల్యాణ్‌తో పాటు ఉన్నతాధికారులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పి మైనింగ్, అటవీ శాఖ అధికారులకు ఫోన్ చేసి బెదిరించినట్లు రవీంద్రనాథ్ రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదులు అందాయి. దీనిని తీవ్రంగా పరిగణించిన ఆయన తక్షణమే విచారణ జరిపి నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

దుర్గమ్మ తెప్పోత్సవం రద్దు

విశాలాంధ్ర-విజయవాడ : దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై వేంచిన శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల తెప్పోత్సవాన్ని రద్దు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. వైభవోపేతంగా పది రోజుల పాటు నిర్వహించనున్న దసరా నవరాత్రులు శనివారంతో ముగియనున్నాయి. కృష్ణానదిలో నీటి ప్రవాహ స్థాయి అధికంగా ఉండటం, అలాగే ఎగువ ప్రాంతం నుంచి దాదాపు 40 క్యూసెకుల వరద నీరు నదిలో ప్రవహిస్తున్నందున చివరి రోజు నిర్వహించే దుర్గమ్మ వారి హంస వాహనం సేవను ప్రభుత్వం రద్దు చేసింది. అమ్మవారి జలవిహారం రద్దు కావడంతో అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. హంస వాహనంపై జల విహారం కాకుండా వాహనంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై దుర్గామల్లేశ్వరస్వామి వార్లకు పూజలు నిర్వహిస్తారని తెలిపింది.

రూ.8,114 కోట్ల ట్రూఅప్ చార్జీల భారం వద్దు

ఈఆర్‌సీకి సీపీఎం నేత శ్రీనివాసరావు లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన విద్యుత్ నియంత్రణ మండలి ట్రూఅప్ చార్జీలపై నిర్ణయం తీసుకోకుండా ఇప్పటివరకు కాలయాపన చేయడం సమంజసం కాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలికి (ఈఆర్‌సీ)కి శుక్రవారం ఆయన లేఖ రాశారు. మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాలుగు త్రైమాసికాల రూ.8,114 కోట్లు ఎఫ్‌పీపీసీఏ (ఇంధన సర్దుబాటు చార్జీలు) ప్రతిపాదనలను అనేక నెలల క్రితమే మండలికి పంపినప్పటికీ వీటిపై ప్రజాభిప్రాయం తీసుకోకుండా జాప్యం చేయడం సరికాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా హిందూజా సంస్థకు (హెచ్ఎన్‌పీసీఎల్) రూ.1,234.68 కోట్లు విద్యుత్ సంస్థలు చెల్లించడం అక్రమమని పేర్కొన్నారు. ఈ భారాన్ని కూడా ట్రూఅప్ ప్రతిపాదనలలో కలపడం శోచనీయమన్నారు. అక్రమ చెల్లింపుపై మండలి ముందు సీపీఎం గతంలో అనేకసార్లు లేవనెత్తినప్పటికీ, దీనిపై చర్చించడానికి నిరాకరించి, నేడు ట్రూఅప్ ప్రతిపాదనలో ప్రజల కళ్లుగప్పే రీతిలో పొందుపర్చడం ఆక్షేపణీయమన్నారు. పంపిణీ సంస్థలు ట్రూఅప్ ప్రతిపాదనలపై సమాచారం ఇచ్చిన తర్వాత ఎనిమిది నెలల పాటు స్పందించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. మండలి చైర్మన్, టెక్నికల్ సభ్యుడు పదవీకాలం పూర్తవుతున్న సమయంలో హడావుడిగా ఇలాంటి విచారణ చేపట్టడం హేతుబద్ధం కాదన్నారు. నిబంధనల స్ఫూర్తికి భిన్నంగా, ఏకపక్షంగా రూ.8,114 కోట్ల ట్రూఅప్ చార్జీల భారాలపై విచారణ ప్రక్రియ సాగించడం, దానిని మొక్కుబడి మార్చడం తగదని లేఖలో తెలిపారు.

27న యానాంలో కవిసంధ్య స్వర్ణోత్సవం

హైదరాబాద్: కవి సంధ్య కవిత్వ పత్రిక స్థాపించి 50 సంచికలు పూర్తి చేసుకున్న సందర్భంగా అక్టోబర్ 27 ఆదివారం ఉదయం 10 గంటలకు యానాం గీతా భవన్‌లో స్వర్ణోత్సవసభ జరుగుతుందని కవిసంధ్య అధ్యక్షుడు డా.శిఖామణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ, వాడ్రేవు చిన వీరభద్రుడు, పాయల మురళీకృష్ణకు కవితా పురస్కారాలు, పదిమందికి సంధ్య ప్రతిభా పురస్కారాల ప్రదానం, శిఖామణి మలయాళ కవిత్వ గ్రంథావిష్కరణ, కవి సమ్మేళనం ఉంటాయి. సభలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, డా.దీర్ఘాశి విజయ్ భాస్కర్, డా. సి.మృణాళిని, డా.వీర లక్ష్మీదేవి, డా.ఆర్.సీతారాం, డా.చెలికాని స్టాలిన్, దాట్ల దేవదానం రాజు, మధునాపంతుల, డా.వరుగు భాస్కర్‌రెడ్డి, బొల్లోజు బాబా, అద్దేపల్లి ప్రభు, సుంకర గోపాల్ తదితరులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

సాగునీటి రంగానికి ప్రత్యేక కార్యాచరణ

సీఎంకు దశరథరామిరెడ్డి లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాయలసీమలో ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తామని ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సాగునీటి రంగానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. మీ సారథ్యంలో చెడును పారద్రోలుతూ మంచి దిశగా చేపట్టే కార్యక్రమాలతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర విస్తీర్ణం... వ్యవసాయోగ్యమైన భూమిలో రాయలసీమ 42 శాతం కలిగి ఉందన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని సాగునీటి బడ్జెట్‌లో 42 శాతం నిధులను రాయలసీమ సాగునీటి రంగానికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో కల్పించిన బుందేల్‌ఖండ్, కోరాపుట్, బోలంగీర్ తరహా ప్రత్యేక ప్యాకేజీ నిధులను సాధించి, రాయలసీమను సమానాభివృద్ధి దిశగా పరుగులు పెట్టించాలని కోరారు. జాతీయ స్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయం, హార్టికల్చర్ కమిషనరేట్ తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. కృష్ణానది నీటి నిర్వహణకు అత్యంత కీలకమైన శ్రీశైలం రిజర్వాయర్ ఉన్న కర్నూలు జిల్లాలో కృష్ణా నది యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయాలని బొజ్జా విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి సాగుతో మేలు: రమేశ్ చంద్

విశాలాంధ్ర-మంగళగిరి: ప్రకృతి సాగుతో రసాయనలు రహిత పంటోత్పత్తులు లభిస్తాయని, అవి ఆరోగ్యానికి మేలు చేస్తాయని నీతి అయోగ్ సభ్యుడు, డాక్టర్ రమేశ్ చంద్ అన్నారు. ఎరువులపై సబ్సిడీల భారం ప్రభుత్వానికి తగ్గుతుందని, ఆ మొత్తాన్ని రైతుల సంక్షేమం కోసం వినియోగించే అవకాశం కలుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచేందుకు, సంబంధిత విజ్ఞానాన్ని పాఠ్యాంశాల్లో చేర్చడం శ్రేయస్కరమని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) ద్వారా అమలు చేస్తున్న ప్రకృతి విధానాలపై అవగాహన కోసం రమేశ్ చంద్ నేతృత్వంలో ఎనిమిది మంది సభ్యుల బృందం శుక్రవారం గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలోని నూతక్కి, దుగ్గిరాల, రేవేంద్రపాడు గ్రామాల్లో పర్యటించింది. ప్రకృతి సాగు పద్ధతులను, సాగవుతున్న ఉద్యాన పంటలను పరిశీలించింది. రమేశ్ చంద్ ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం లాభసాటిగా సాగుతుండటంపై హర్షం వ్యక్తంచేశారు. ముందుగా నాలుగు ఎకరాల్లో అరటి సాగు చేసే రైతు శ్రీనివాసరెడ్డిని కలిసి పకృతి వ్యవసాయానికి... రసాయన వ్యవసాయానికి మధ్య తేడా, ఎంత పెట్టుబడికి ఎంత లాభం వస్తుందనే విషయాలు తెలుసుకున్నారు. అనంతరం దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడు గ్రామంలో 15 మంది రైతులను కలిసి 15 ఎకరాలలో పండించే వరిని పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ అధికారులు డీవీ రాయుడు, చంద్రశేఖర్, గోపీచంద్, వరప్రసాద్, రామచంద్రం, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖ అధికారి రవీందర్ బాబు, ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, మంగళగిరి, దుగ్గిరాల తహసీల్దార్లు సుభానీ, సునీత పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరల భారం అరికట్టాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నిత్యావసర సరుకుల ధరల భారాన్ని అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం తీర్మానించింది. రెండు రోజులపాటు విజయవాడలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు, ఎంఏ బేబి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరయ్యారు. సమావేశంలో తీసుకున్న వివరాలను శుక్రవారం పార్టీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు వెల్లడించారు. ప్రజాపంపిణీ ద్వారా 16 రకాల సరకులు అందించాలని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. ఎన్నికల ముందు బీజేపీ ప్రభుత్వం... ధరలు అదుపు చేస్తామని, ఉచితంగా ఆహార ధాన్యాలు అందిస్తామని ఇచ్చిన హామీకి విరుద్ధంగా గత బడ్జెట్‌లో ఆహార భద్రతకు భారీగా నిధులు తగ్గించిందన్నారు. ఒక పక్క బహిరంగ మార్కెట్‌ను కార్పొరేట్‌లకు కేంద్రం కట్టబెడుతూ ప్రజలను నమ్మించడానికి ఈ ఏడాది చివరి వరకూ ఉచితంగా బియ్యం అందిస్తామని కపటనాటక మాడుతోందన్నారు. నిత్యావసరాల ధరల అదుపు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని, ప్రజాపంపిణీ ద్వారా అన్ని రకాల నిత్యావసర సరుకులు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు.

అప్పుల బాధతో నేతన్న ఆత్మహత్య

విశాలాంధ్ర-ధర్మవరం: అప్పుల బాధ తాళలేక నేతన్న ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాలివి. పట్టణంలోని రాంనగర్‌లో ఉడుముల రంగా (45) కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. మూడేళ్లుగా చీరలకు గిట్టుబాటు ధర రాకపోవడం, ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడం, కుటుంబ పోషణ, పిల్లల చదువులకు అప్పులు చేశాడు. ఎలా తీర్చాలో తెలియక మనోవేదనతో శుక్రవారం తెల్లవారుజామున ఇంటిలో ఉన్న మగ్గం వద్దే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి భార్య రేవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.. మృతుడికి భార్యతో పాటు కుమార్తె పావని, కుమారుడు జస్వంత్ ఉన్నారు. సుమారు రూ.ఐదు లక్షల వరకు అప్పులు ఉన్నట్లు బంధువులు తెలిపారు.

14న ప్రపంచ ప్రమాణాల దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధ్వర్యంలో ఈనెల 14వ తేదీన ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్, శాస్త్రవేత్త డి.వివేక్ వర్ధన్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల్లో బీఐఎస్ కార్యకలాపాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. దేశంలో నాణ్యత, ప్రమాణాల సంరక్షణగా బీఎస్ఐ తన సేవలను కొనసాగిస్తోందని వివరించారు. ఈ సంస్థ 1986లో ఏర్పాటైందని, అప్పటి నుంచి వినియోగ దారులకు అత్యంత సేవలను అందిస్తోందన్నారు. 2016 బీఐఎస్ చట్టం దీన్ని మరింత పటిష్ఠం చేసి... ఎలక్ట్రానిక్స్ నుంచి ఆభరణాల ఉత్పత్తుల కోసం ప్రమాణాలను రూపొందించడంతో కీలకంగా నిలిచిందన్నారు. ఆయా ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా, బీఐఎస్ మార్గదర్శకాలను రూపొందించిందని తెలిపారు. ఆభరణాలు, ఉత్పత్తులలో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే... దానికి అనుగుణంగా వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఒక ప్రత్యేక యాప్ రూపొందించినట్లు వివరించారు.

గెలిస్తే ఓ మాట... ఓడితే మరో మాటా?

చంద్రబాబుపై మాజీ మంత్రి నాగార్జున ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు గెలిస్తే ఒక మాట, ఓడిపోతే మరో మాట మాట్లాడటం సిగ్గుచేటని మాజీ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల్లో ఈవీఎంల వినియోగంపై లెక్కలేనన్ని సార్లు యూటర్న్ తీసుకున్న చంద్రబాబు... ప్రజాస్వామ్యంపై మాట్లాడుతుండటం సిగ్గుచేటని అన్నారు. బీజేపీతో కలసి ఉంటే ఓ మాట, లేకుంటే మరో మాటా అని నిలదీశారు. మాటలు ఫిరాయించే చంద్రబాబు, తమ పార్టీ అధినేత జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆక్షేపణీయమన్నారు. చంద్రబాబు మాట్లాడుతుంటే, దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు.

సంపాదకీయం

దళితులపై ఆగని ఆగడాలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తయినా దళితులపై దౌర్జన్యకాండ ఘటనలు సర్వసాధారణమైపోతున్నాయి. దేశంలో ప్రతిరోజూ దళితులపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. కొన్నిసార్లు దళితులను బహిరంగంగా కొట్టడం, మరి కొన్నిసార్లు వారిని గుడిలోకి రానివ్వకపోవడం, చేసిన పనికి జీతం అడగితే దాడులకు దిగడం, దొంగతనం చేశారన్న ఆరోపణలతో అకృత్యాలకు పాల్పడడం నిత్యకృత్యంగా మారి శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. నివేదికల ప్రకారం ప్రతిరోజూ ఇద్దరు ముగ్గురు దళితులు హత్యకు గురవుతున్నారు. దళితులను అవమానించడం, సాంఘిక బహిష్కరణ కేసులు కూడా నిత్యం వెలుగులోకి వస్తూనేవున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) గణాంకాల ప్రకారం దళితులపై అఘాయిత్యాలకు సంబంధించి ప్రతిరోజూ 150కి పైగా కేసులు నమోదవుతున్నాయి. ఎన్డీయే పాలనలో 2018 నుంచి 2022 మధ్య దళితులపై లైంగికదాడులు 35 శాతం పెరిగాయని ఆ నివేదిక తెలిపింది. ఆ నివేదిక ప్రకారం 2018 నుంచి ప్రతి సంవత్సరం కేసుల సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉన్నది. దళితులపై నేరాలకు సంబంధించి 2018లో 42,793 కేసులు నమోదయ్యాయి. 2021లో 50,900 కేసులు, 2022లో 57,582 కేసులు నమోదయ్యాయి. దళితులపై దాడుల కేసులు బీజేపీ పాలిత రాష్ట్రాలలోనే ఎక్కువగా నమోదవుతున్నట్టు ఎన్సీఆర్బీ నివేదిక వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం ఉత్తరప్రదేశ్‌లోని యోగి పాలనలో దళితులపై అఘాయిత్యాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. 2022లో అక్కడ దళితులపై 15 వేలకుపైగా అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. ఎనిమిదిన్నర వేలకు పైగా కేసులు నమోదైన రాజస్థాన్ రెండో స్థానంలో ఉంది. అక్కడ సగటున రోజుకు 12 మంది దళిత మహిళలు లైంగికదాడికి గురవుతున్నట్టు గణాంకాలు కూడా చెబుతున్నాయి. 2022లో దళిత మహిళలపై 4,241 లైంగికదాడి కేసులు నమోదయ్యాయి. ఇదొక్కటే కాదు, దళిత పిల్లలపై 1400కు పైగా అఘాయిత్య కేసులు నమోదయ్యాయి. ఎన్ని కేసులు నమోదవుతున్న చర్యలు లేకపోవడంతో దళితులపై చిన్నచిన్న కారణాలతో కూడా దాడులకు పాల్పడుతున్నారు. యోగీ ఇలాకాలోని భరూచ్ జిల్లా తాజ్‌పూర్ తెడియా గ్రామంలో ఇద్దరు కోళ్ల ఫారం యజమానులు దొంగతనం చేశారన్న అనుమానంతో మంగళవారం ముగ్గురు దళిత బాలురపై దాష్టీకానికి దిగారు. ఆ బాలురను కొట్టి, వారికి గుండు గీయించి, ముఖానికి నల్లరంగు పులిమి గ్రామంలో ఊరేగించారు. 5 కిలోల గోధుమలు అపహరించారని ఆరోపిస్తూ 12-14 ఏళ్ల వయసున్న ముగ్గురు బాలురను కోళ్లఫారాల యజమానులు దారుణంగా కొట్టడమే కాకుండా వారికి శిరోముండనం చేయించారు. ముఖానికి నల్ల రంగు పూశారు. రెండు చేతులు కట్టేసి, ముంజేతులపై 'దొంగ' అని రాసి గ్రామంలో ఊరేగించారు. ఈ ఘటన మొత్తాన్ని ఘనకార్యం చేసినట్టు వీడియో కూడా తీశారు. ఎప్పటిలానే బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితులపై పోలీసులు కేసు నమోదుచేసి చేతులు దులుపుకున్నారు. బీజేపీ మిత్రపక్షం జేడీయూ అధికారంలో ఉన్న బీహార్‌లోనూ దళితులపై అఘాయిత్యాలు సర్వసాధారణమే. భూవివాదం కారణంగా నవాడాలోని దళితకాలనీలోని దళితులపై ఆకృత్యాలు జరిగి నెలరోజుల కూడా గడవక ముందే ముజఫర్‌పూర్ జిల్లా చౌపర్ మదన్ గ్రామంలో మరో దారుణం చోటుచేసుకుంది. చేసిన పనికి జీతం అడిగినందుకు దళిత వ్యక్తిపై యజమాని, అతడి కుమారుడు, మరో వ్యక్తి కలిసి దాడి చేశారు. నేలపైకి తోసి కొట్టారు. కులం పేరుతో దూషించి ముఖంపై ఉమ్మి వేయడంతోపాటు మూత్ర విసర్జన చేసి ఎంతగా హింసించాలో అంతగా హింసించారు. పోలీసులకు ఫిర్యాదుచేస్తే చంపుతామని బెదిరించారని బాధితుడు చెపుతున్నాడు. రమేష్ పటేల్ కోళ్ల ఫారంలో దళితుడైన రింకూ మాంఝీ కొన్ని రోజులు పనిచేశాడు. చేసిన పనికి వేతనం అడిగినందుకు రింకూని సభ్యసమాజం తలదించుకునే విధంగా నానా చిత్రహింసలకు గురిచేశారు.

దళితులు, గిరిజనుల రక్షణ కోసం షెడ్యూల్డ్ కులాల/షెడ్యూల్డ్ తెగ (అత్యాచారాల నిరోధక) చట్టాన్ని 1989లో చేశారు. దళితులు, గిరిజనులపై నేరాలకు పాల్పడిన వారిని శిక్షించడమే ఈ చట్టం ఉద్దేశం. ఎస్సీ-ఎస్టీ వర్గాల ప్రజలకు రక్షణ, హక్కులను ఈ చట్టం అందిస్తుంది. ఈ చట్టం ప్రకారం ప్రత్యేక న్యాయస్థానాలు కూడా ఏర్పాటవుతాయి, ఇలాంటి కేసుల్లో ఆ న్యాయస్థానాలు త్వరగా నిర్ణయాలు తీసుకుంటాయి. ఇదంతా కేవలం రాతల్లోనే... ఆచరణలో ఒక్కటీ అమలు జరగదు. చట్టం చేసిన తరువాత వాటిలో లొసుగులను ఆధారంగా చేసుకుని కోర్టుల నుంచి నిందితులు ఉపశమనం పొందుతుంటారు.

ఎస్సీ,ఎస్టీ చట్టం కింద నమోదైన కేసుల్లో తక్షణ అరెస్టులను 2018 మార్చిలో సుప్రీంకోర్టు నిషేధించింది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని సవరించింది. ఎస్సీ,ఎస్టీలైన ప్రతి వ్యక్తికి రక్షణ కల్పించాలన్న లక్ష్యంతోనే ఈ చట్టాన్ని రూపొందించారు. కానీ దళితులపై అరాచకాలు, వేధింపులకు పాల్పడిన పెత్తందార్లు, మాఫియా, రాజకీయ నేతలపై ఈ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంలేదన్న దళిత సంఘాల విమర్శలలో ఏమాత్రం అవాస్తవంలేదని చెప్పవచ్చు. దళితులపై అఘాయిత్యాలకు పాల్పడిన నిందితులకు శిక్ష విషయానికొస్తే ఎన్సీఆర్బీ నివేదిక ప్రకారం నేరారోపణ రేటు 34 శాతం. గత రెండేళ్లుగా శిక్షల రేటు తగ్గుతూ వస్తోంది. వాస్తవానికి పోలీసు స్టేషన్లలోనే వాటిని రాజీ చేయటమో...లేక బెదిరించి కేసులు ఉపసంహరించుకునేలా చేస్తున్నారనేది దళిత సంఘాల వాదన. 2018లో నేరారోపణ రేటు 42 శాతం కంటే ఎక్కువగా ఉంది, ఇది 2021లో 36 శాతానికి తగ్గింది. 2022లో శిక్షా రేటు 34 శాతంగా ఉంది. చట్టాలు సక్రమంగా అమలు చేయకపోవడం, దళితులపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై చర్యలు లేకపోవడంతో పెత్తందారులు, రాజకీయ నాయకులు తదితరులు యథేచ్ఛగా దాడులకు పాల్పడుతున్నారు. కొద్ది సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ఎమ్మెల్సీ దళితుడైన తన కారు మాజీ డ్రైవర్‌ను కొట్టిచంపి మృతదేహాన్ని స్వయంగా కారులో తీసుకువచ్చి దళితుడి ఇంటి వద్ద పడవేస్తే ఇంత వరకు ఆ ఎమ్మెల్సీపై చర్య లేకపోవడం చట్టాల అమలుతీరును ప్రతిబింబిస్తోంది. బీజేపీ, దాని మిత్రపక్షాలు, మద్దతిస్తున్న పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో దళితులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఎప్పుడో పోయింది, పాలకులు, కోర్టులు చట్టాలు కఠినంగా అమలు జరిగేలా చూసి దళితులపై ఆగడాలకు పాల్పడేవారిని శిక్షించాల్సిన అవసరంవుంది. అప్పుడే దళితులపై అత్యాచారాలు, అగడాలకు అంతం ఉంటుంది. ఈ విధమైన దాడులు జరగకుండా రాజకీయ పార్టీలు కూడా చర్యలు తీసుకోవాలి. దాడులకు పాల్పడిన వారిపై పార్టీ పరంగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

"టాటా... వేడుకోలు"... మళ్లీ పుట్టవా

ఇదిగో ఇలాంటి వాళ్లు వెళ్లిపోతేనే లోటు అనిపిస్తుంది. తెలుస్తుంది. ఆయన లేదూ ఆమె మరణం తీరని లోటు అంటూ వచ్చే సంతాప సందేశాలు చదువుతూంటే ఆ లోటు పెద్దగా కనిపించిన పాపాన పోలేదు. పైగా అలా వెళ్లిపోయిన వారి వయసు గుర్తొచ్చి "వీళ్లు లేకపోవడం లోటు అంటారేమిటి. ఈ పడికట్టు పదాల సంతాపాలు మార్చరా... వీళ్లు మారరా" అని అనుకునే వాడ్ని. చాలాకాలం నా తప్పేమోలే అని సరిపెట్టుకున్నాను. కానీ ఇదిగో టాటా వారబ్బాయి రతన్ టాటా వెళ్లిపోతే మాత్రం " ఇలా ఉండాలి మరణం... అలా ఉండాలి జీవిక" అనిపించింది. సెలవుల్లో ఎర్లీ మార్నింగ్ 9 గంటలకు కానీ నిదురలేవని నా కూతురు గురువారం ఉదయం ఆరు గంటలకి లేచి "ఈ డబ్బున్న వాళ్లు, వ్యాపారవేత్తల్లాంటి వారు కాదు నాన్న ఈయన. ఈ రతన్ టాటా ఇంకొన్నాళ్లు ఉండాల్సింది" అంటూ నిదుర కన్నీరు కార్చింది. ఏమంటాం. ఆ నూత్న యవ్వన బాలికను ఏమనగలం. "అవునమ్మ" అని సముదాయించే ప్రయత్నం చేయడం తప్ప ఇంకేమనలేకపోయాను. ఆ ఉదయం ఏడు గంటలకు ఆన్ చేసిన టీవీ ఆయన తుది ఘడియలు చూసే వరకూ ఆపితే రతన్ టాటా మీద ఒట్టు.

ఆ మధ్య ఓ బాగా డబ్బు చేసిన పెద్దింటాయన ఇంట్లో పెళ్లిని

చక్రవాకం

- ముక్కాము చక్రధర్

కూడా టీవీలు అదే పనిగా చూపించాయి. "వీళ్లకి ఇంకేం దొరకలేదా" అనే మాటలూ వినిపించాయి. పైగా, అక్కడికి వెళ్లిన వారంతా అతిరథ మహారథులు. ఆ పెద్దాయన కాళ్లకి మరో పెద్దాయన దండం పెట్టాడని, ఆ పెళ్లి కొడుకు ఉంగరపు వేలు ఒక్కటే వందల కోట్ల ఖరీదని... ఇలా చాలానే విన్నాం. చదివాం. చూశాం. రతన్ టాటా కూడా చాలా డబ్బున్న ఆసామే. కానీ అదేం చిత్రమో ఈయన్ని కడసారి చూసేందుకు ఆ వర్లీ ప్రాంతమంతా సామాన్యులతో నిండిపోయింది. చాంతాడంత కాదు... అనేకానేక చాంతాళ్లంత క్యూ లైన్లలో నిలబడిన వేలాది మంది దిగువ, మధ్య తరగతి జనాల్ని చూస్తుంటే స్వతంత్ర దేశంలో చావు కూడా పెళ్లి లాంటిదే... కాకపోతే నీ జీవికను అనుసరించే ఉంటుంది ఆ మరణానంతర స్థితి అనిపించింది.

పది మందికి మంచి చేసిన వాళ్లు, బాగు కోరేవారు బతికుండగా వాళ్ల గురించి మాట్లాడాల్సిన నాలుగు మాటలు ఎవ్వరూ మాట్లాడకపోవడం ఎంత అనర్థమో రతన్ టాటా మహా ప్రస్థానం తర్వాత తెలిసింది. ఆయన గురించి "ఇంత తెలిసి యుండి ఆ గుణమేలరా" అని వాట్సాప్‌ల్లో, సోషల్ మీడియాల్లో సందేశాలు పంపుతున్న వారిని నిలదీయాలనిపించింది. ఈ రతన్ టాటా ఇలా చేస్తున్నారని ఆయన మరణానంతరం కాకుండా ముందే తెలిసి ఉంటే... ఈ మీడియాతో పాటు సోషల్ మీడియా సందేశాల జోరువాన కాసింత ముందుగా వచ్చి ఉంటే... బహుశా, ఆ సందేశాల తాకిడికి ఆయనకు భారతరత్న ఇచ్చే వారేమో అనే అనుమానం కూడా వచ్చింది. ఈ దేశ ఏలికల గురించి, ఇక్కడి ప్రజల గురించి ముందే తెలిసిన రతన్ టాటా తండ్రి తన కుమారుడ్ని గుర్తించడంలో లోపం జరుగుతుందని గ్రహించారేమో... అందుకే ఆయనే తన కొడుక్కి రతన్ అంటే రత్నం అని పేరు పెట్టుకున్నారనిపిస్తోంది.

పూల వనాల ఊరు తెలుసా... జాతీయ రహదారి మీద సువాసనలు వెదజల్లుతూ స్వాగతం పలుకుతుంది ఓ ఊరు. అదే కడియం. ఆ కడియం కుర్రాడు వెంకట శేషు ఈ బిజినెస్ టైకూన్ రతన్ టాటాకి స్నేహితుడంటే నమ్మగలమా..! రతన్ టాటా అయితే, "కొన్ని క్యారెక్టర్లు చూసి నమ్మేయాలి దూడ్" అంటారు. అవును, ఈ శేషు అనే కుర్రాడు రాసిన కొన్ని పర్యావరణ కొటేషన్లు రతన్ టాటాకి నచ్చడంతో ప్రారంభమైన వారిద్దరి స్నేహం.. శేషు తల్లి స్వయంగా చేసి పెట్టిన డ్రైఫ్రూట్ లడ్డూలను ఇష్టంగా తినేంతగా పెరిగింది. కడియానికి, ముంబైకి మధ్య దూరాన్ని కిలోమీటర్లలో కొలవగలం. మరి ముంబై వాణిజ్యవేత్త రతన్ టాటా, కడియం కుర్రాడు శేషు మధ్య స్నేహాన్ని కొలవడానికి ఏ మీటర్లు పనిచేస్తాయి దూడ్.

గోవా చూశారా ఎప్పుడైనా... సముద్ర తీరం... అందమైన పరిసరాలు, పర్యాటక ప్రాంతం గోవా కాదు. రతన్ టాటా గోవా వెళ్తే ఆయన చుట్టూ తోకూపుకుంటూ తిరిగిన ఓ వీధి కుక్క. మామూలుగా అయితే, ఆ కుక్కో అలాంటిదే మరో వీధి శునకమో కనపడితే వెంటనే ఛీ అంటూ చీదరించుకుంటాం కదా. కానీ, రతన్ టాటా అలా చేయలేదు. తన వెంట ఆ వీధి కుక్కని ముంబై తెచ్చుకున్నారట. దానికి గోవా అని పేరు పెట్టుకున్నారట. రతన్ టాటా భౌతికకాయం దగ్గర మూగగా ఏడుస్తున్న గోవాను ఓదార్చేందుకు ఆ సమూహంలో ఎవరూ కానరాలేదు. ఎందుకంటే గోవా రోదన అర్థం చేసుకునే ఏకైక మనిషి అక్కడే ఆ శయ్యపై ఉన్నారు. ఈ మూగ ప్రేమని ఎలా చూడగలం. మహా అయితే ఇదిగో ఇలా రాయగలం. అనుభవించగలమా..!

మళ్లీ మా అమ్మాయే అడిగింది టీవీ చూస్తూ... "నాన్న ఈయన వారసులెవరూ" అని...

"వ్యాపారులకు, వాణిజ్యవేత్తలకు వారసులంటారమ్మా... మానవత్వానికి వారసత్వం ఉండదు" అన్నాను.

సీనియర్ జర్నలిస్టు
సెల్: 9912019929

విశాఖ ఉక్కును కాపాడాలి

జమ్ముల కృష్ణారావు

"కుక్కను చంపాలంటే పిచ్చిదని ముద్ర వేయాలి" అని పల్లెటూరి సామెత. విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇదే వైఖరి అవలంబిస్తున్నది. విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మివేయాలన్నా, మూసివేయాలన్నా నష్టాలను సాకుగా చూపించాలి. అందుకు ఉద్దేశపూర్వకంగా గత కొద్ది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం తనకు తానుగా విశాఖ ఉక్కు కునారిల్లిపోయే పరిస్థితులను కల్పిస్తున్నది. అంటే "పొమ్మనకుండా పొగబెట్టే" వైఖరి అనుసరిస్తున్నది. ఉద్దేశపూర్వకంగా విశాఖ ఉక్కు ఉత్పత్తిని తగ్గించి వేస్తున్నారు. రోజుకు 21 వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న పరిశ్రమలో మూడు ఫర్నేస్‌లు ఉంటే రెంటిని మూసివేసి ఒకదానిని మాత్రమే పనిచేయిస్తున్నారు. ముడి సరుకు కొరత సాకుగా చెబుతున్నారు. దేశంలో అన్ని ఉక్కు కర్మాగారాలకు సొంత ఇనుప ఖనిజం గనులను కేటాయించి విశాఖ ఉక్కుకు మాత్రం కేటాయించటం లేదు. రెండు లక్షల మెట్రిక్ టన్నులకు పైగా బొగ్గు విదేశాల నుంచి వచ్చి విశాఖ తీరంలో ఉంటే విశాఖ ఉక్కు దానిని వినియోగించుకోకుండా ఆంక్షలు విధిస్తున్నారు. గంగవరం పోర్టుకు విశాఖ ఉక్కు స్థలాలను ధారాదత్తం చేసిన కేంద్రప్రభుత్వం, ఆ పోర్టును ప్రధాని నరేంద్రమోదీ అనుంగు మిత్రుడు అదానీకి కట్టబెట్టి విశాఖ ఉక్కును చౌకగా కైంకర్యం చేసేందుకు అవకాశం కల్పించేందుకు ఈ ఆంక్షలు విధిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం వరకు 13 వేల టన్నుల ఉత్పత్తి చేస్తున్న స్థితి నుంచి నేడు ఐదువేల టన్నులకు కుదించి వేశారు. గంగవరం పోర్టును వినియోగించి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని దెబ్బకొట్టాలని ప్రయత్నిస్తున్నారు. విశాఖ ఉక్కు భూములను పోస్కో కంపెనీకి కట్టబెట్టాలని విశ్వ ప్రయత్నం చేస్తే కార్మికులు, ప్రజలు ప్రతిఘటించారు. జిందాల్ కంపెనీతో రహస్య ఒప్పందం చేసుకుని విశాఖ ఉక్కును నష్టాల బాట పట్టించారు. దేశంలోని అన్ని స్టీల్ ప్లాంట్‌లు లాభాలలో నడుస్తుంటే ఒక్క విశాఖ ఉక్కును మాత్రం కావాలని నష్టాలలోకి నెట్టివేశారు.

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులపై దాడి చేయటమే కాకుండా ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నది. అనేక కీలక పరిశ్రమలను, సంస్థలను, ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు కారుచౌకగా అప్పగిస్తున్నారు. బీజేపీ పాలనలో గత 10 ఏళ్ల కాలంలో అనేక ప్రభుత్వ రంగ సంస్థలు కనుమరుగైపోయాయి. నాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వరంగ సంస్థలను ఆధునిక దేవాలయాలుగా అభివర్ణిస్తే నేటి పాలకులు గుదిబండలుగా భావిస్తున్నారు. ప్రజల త్యాగంతో, 32 మంది బలిదానంతో, రైతుల నిస్వార్థపరత్వంతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ఆధునిక ఉక్కు దేవాలయాన్ని ధ్వంసం చేయాలని, దాని గొంతు నొక్కివేయాలని మోదీ ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నది. "విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు" అంటూ గత 1350 రోజులుగా ఫ్యాక్టరీ కార్మికులు, రాష్ట్ర ప్రజలు, నిర్వాసితులు ఆందోళన చేస్తుంటే కేంద్రప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. ఎంత ఆందోళన చేసినా పరిశ్రమ పరిస్థితిని రోజురోజుకు దిగజార్చుతున్నారు. నూటికి నూరుశాతం సంస్థను అమ్మివేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.

మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులపై దాడి చేయటమే కాకుండా ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నది. అనేక కీలక పరిశ్రమలను, సంస్థలను, ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు కారుచౌకగా అప్పగిస్తున్నారు. బీజేపీ పాలనలో గత 10ఏళ్ల కాలంలో అనేక ప్రభుత్వ రంగ సంస్థలు కనుమరుగైపోయాయి.నాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వరంగ సంస్థలను ఆధునిక దేవాలయాలుగా అభివర్ణిస్తే నేటి పాలకులు గుదిబండలుగా భావిస్తున్నారు. ప్రజల త్యాగంతో, 32 మంది బలిదానంతో, రైతుల నిస్వార్థపరత్వంతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ఆధునిక ఉక్కు దేవాలయాన్ని ధ్వంసం చేయాలని, దాని గొంతు నొక్కివేయాలని మోదీ ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నది.

ఇప్పుడు తాజాగా ఉక్కు యాజమాన్యం కేంద్ర ఆదేశాలకు అనుగుణంగా ఎంతో కాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను 4,200 మందిని సెప్టెంబరు 28 న రాత్రికి రాత్రి చట్ట విరుద్ధంగా నోటీసు ఇవ్వకుండా పని నుంచి తొలగించింది. గేట్ పాస్‌లు రద్దు చేసింది. 500 మంది అధికారులను వివిధ ఇతర కంపెనీలకు బదిలీ చేశారు. 2,500 మంది పర్మినెంట్ కార్మికుల తొలగింపునకు పూనుకున్నారు. వేతనాలతో పాటు ఇతర సౌకర్యాల చెల్లింపులో కోత విధించారు. ఇంటి అద్దెల చెల్లింపులు ఆపివేశారు. 14,000 మంది కాంట్రాక్టు కార్మికులకు గత నాలుగు నెలలుగా జీతాలు కూడా చెల్లించటం లేదు. ఈ విధంగా ఆచరణలో ప్లాంటు మూసివేతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. దీనిపై కార్మిక సంఘాలు ప్లాంటు ప్రధాన కార్యాలయం వద్ద, రాష్ట్ర వ్యాపితంగా ఆందోళనకు పూనుకోగా ప్రభుత్వం దిగివచ్చి వారిని తిరిగి పనిలో పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ రోజుకో అధికారిని ప్లాంటుకు పంపి మూసివేతకు ప్రయత్నాలు సాగిస్తున్నది. ప్లాంటులోని 32 కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమం సాగిస్తున్నాయి. విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేయరాదని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని వారు కోరుతున్నారు. మోదీ మూడవసారి ప్రధానిగా ప్రమాణం చేసిన తరువాత విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నాలను వేగవంతం చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, సహాయమంత్రి శ్రీనివాసవర్మ (మన రాష్ట్రం) స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ దేశంలోనే అత్యంత ఉత్తమమైన పరిశ్రమగా ప్రశంసించారు. 45 రోజుల్లో ప్లాంటు పరిరక్షణకు ప్రణాళిక సిద్ధం చేస్తామని ప్రకటించారు. కానీ ఆ తరువాత ఆచరణలో కార్మికుల తొలగింపు ప్రక్రియ ప్రారంభించారు. మంత్రులు రాకముందు రెండు ఫర్నేస్‌లు పని చేస్తుంటే వారు వచ్చి వెళ్లిన తర్వాత ఒక్కటి మాత్రమే పనిచేస్తున్నది. గతంలో 3.4 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ప్లాంటును ఇప్పుడు 7.3 మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి తీసుకువెళ్లిన ఘనత విశాఖ ఉక్కు కార్మికులదే అనటంలో అతిశయోక్తి లేదు. ప్లాంటు రూ.12, 900 కోట్ల లాభాలను సైతం ఆర్జించింది. 10 వేల కొత్త ఉద్యోగాల కల్పనకు భూమికను ఏర్పరిచింది. సెయిల్‌లో ఒక మెట్రిక్ టన్ను ఉక్కు ఉత్పత్తికి 2 వేల మంది కార్మికులు కష్టపడుతుంటే, విశాఖలో 1500 మంది మాత్రమే పనిచేసి నాణ్యమైన ఉత్పత్తిని చేస్తున్నారు. ఈ స్థితిలో కేంద్ర ప్రభుత్వం 32 మంది ప్రాణాలుఇచ్చి సాధించుకున్న 64 గ్రామాల ప్రజలు భూములను ఇచ్చి సాధించుకున్న ఈ సంస్థ గొంతు నొక్కే ప్రయత్నం ముమ్మరం చేసింది. ఆంధ్రుల ఆత్మగౌరవానికి, పోరాటానికి చిహ్నమైన ఈ సంస్థను కాటికి పంపాలన్న దుర్బుద్ధితో ఆలోచన చేస్తున్నది. కేంద్ర ఉక్కుశాఖ కేబినెట్ మంత్రి కుమారస్వామి తన సొంత రాష్ట్రం కర్నాటకలోని చిన్న ఫ్యాక్టరీకి 15,000 కోట్లు కేటాయింపులు చేస్తే మన రాష్ట్రానికి చెందిన సహాయ మంత్రి కనీసం రూ. 5 వేల కోట్లు కేటాయించుకోలేని దుస్థితిలో ఉన్నారు. కేంద్రం "బియ్యం ఇవ్వకుండా అన్నం వండమన్నట్లు" గా వ్యవహరిస్తున్నది. గత్యంతరంలేని స్థితిలో గత 1350 రోజులుగా విశాఖ స్టీల్ ప్లాంటును "అమ్మేదెవడురా? కొనేది ఎవడురా?" అంటూ పట్టుదలతో కార్మిక సంఘాలు ఉద్యమం సాగిస్తున్నాయి.

విశాఖ స్టీల్ వర్కర్స్ యూనియన్ ఎడిషనల్
జనరల్ సెక్రటరీ, సెల్: 9866111499

భారంకానున్న సర్దుబాటు చార్జీలు

బొల్లిముంత సాంబశివరావు

ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ చార్జీలు భారీగా పెరగనున్నాయి. అందుకోసం ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) లు, ఇంధన విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు చార్జీల (ట్రూ అఫ్ చార్జీలు) ప్రతిపాదనలను సిద్ధం చేశాయి. ఈ సర్దుబాటు భారం 8,113 కోట్లుగా ఉంది. 2022-23 సంవత్సరంలో ఇంధన కొనుగోలు వ్యత్యాసాలను సరిదిద్దటం కోసమే ఈ సర్దుబాటు చార్జీల ప్రతిపాదనగా చంద్రబాబు ప్రభుత్వ 'డిస్కం' అంటున్నది. గృహ వినియోగదారులపై 2,191 కోట్లు, వాణిజ్య వినియోగదారులపై 669 కోట్లు, వ్యవసాయంపై 1,901 కోట్లు, పరిశ్రమలపై 547 కోట్లు, ఇతరులపై 55 కోట్లు ఈ సర్దుబాటు భారం పడుతుంది. 18-10-2024న ప్రజాభిప్రాయ సేకరణ జరిగిన తర్వాత సర్దుబాటుపై ఏపీ ఈఆర్సీ ఆదేశాలు జారీ చేస్తుంది.

ట్రూ అఫ్ చార్జీలు : రిటైల్ విద్యుత్ సరఫరాకు సంబంధించి డిస్కంల ద్వారా జరిగిన లావాదేవీల్లో వచ్చిన నష్టాల సర్దుబాటు గానూ ప్రజల నుంచి అదనపు వసూళ్లకు ఈ ట్రూ అఫ్ చార్జీలు తెచ్చారు. 2014-19 మధ్య చంద్రబాబు పాలనలో జరిగిన విద్యుత్ నష్టాలను తీర్చటానికి వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజల నుంచి 19,603 కోట్ల వసూలుకి డిస్కంలు అనుమతి కోరగా, ఏపీఈఆర్సీ 3,103 కోట్లకు అనుమతించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అదే విధంగా జగన్ పాలనలో జరిగిన నష్టాలను పూడ్చటానికి ట్రూ అప్ చార్జీలు ప్రజల నుంచి వసూలు చేయనుంది. అందులో భాగమే జెన్‌కో విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన.

విద్యుత్ సంస్థల అప్పులు: ఆంధ్రప్రదేశ్‌లోని విద్యుత్ సంస్థలు నష్టాలు, అప్పుల్లో కూరుకు పోయాయి. 2014లో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడే నాటికి డిస్కంల నికర నష్టం 4,315 కోట్లు కాగా, 2019లో టీడిపి ప్రభుత్వం దిగిపోయే నాటికి 20 వేల కోట్లకు చేరుకున్నాయి. జెన్ కో, ట్రాన్స్ కో, డిస్కంల అప్పులు, విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు, పంపిణీ సంస్థలు చెల్లించాల్సిన బకాయిలు మార్చి 2014 నాటికి 29,551 కోట్లు కాగా, చంద్రబాబు దిగిపోయేనాటికి 86,215 కోట్లకు పెరిగాయి. చంద్రబాబు పాలనలో పెరిగిన అప్పు 56,663 కోట్లు. జగన్మోహనరెడ్డి ప్రభుత్వ పాలనలో ఈ అప్పు 1,22,518 కోట్లకు చేరుకుంది. జగన్ పాలనలో పెరిగిన అప్పు 36,303 కోట్లు. దేశంలో బొగ్గు నిల్వలు: భారతదేశంలో బొగ్గుకి, థర్మల్ విద్యుత్ సంస్థలకు విడదీయరాని సంబంధం ఉంది. దేశంలో బొగ్గు గనులు అపారంగా ఉన్నాయి. ప్రపంచ వ్యాపితంగా బొగ్గు ఉత్పత్తి, వినియోగంలో చైనా తర్వాత భారతదేశం రెండవ స్థానంలోఉంది. దేశంలో ఇంధన ఉత్పత్తిలో బొగ్గు వాటా 70% పైగా ఉంది. 1973లో బొగ్గు గనులను జాతీయం చేశారు. అప్పటి నుంచి ప్రభుత్వ సంస్థలే అత్యధికంగా బొగ్గును ఉత్పత్తి చేస్తున్నాయి. దేశంలో 31,900 కోట్ల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని బొగ్గు మంత్రిత్వ శాఖ తెలిపింది. 2019-20 లో 73.08 కోట్ల టన్నులు, 2020-21లో 71.60 కోట్ల టన్నుల బొగ్గు తవ్వకాలు జరిగాయి. మిగిలి ఉన్న బొగ్గు నిల్వలు దేశ అవసరాలకు సరిపోతుంది. ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా 2019లో దేశంలో ఉత్పత్తి అయిన మొత్తం బొగ్గులో 80 శాతం పైగా ఉత్పత్తి చేసింది. 2లక్షల, 70 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.. 500 బిలియన్ రూపాయలకు పైగా పన్నులు, రాయల్టీల రూపంలో కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలకు చెల్లించింది. ఇది కేంద్ర ప్రభుత్వ వార్షిక ఆదాయంలో 3శాతం. 53శాతం పైగా విద్యుత్ ఉత్పత్తి బొగ్గు ద్వారానే జరుగుతున్నది.దేశంలో అవసరమైన బొగ్గు ఉన్నా దాన్ని విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు అందించే చర్యలు తీసుకోకుండా అధిక ధరలకు బొగ్గు దిగుమతి వల్ల విద్యుత్ సంస్థలు నష్టపోతున్నాయి. ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపిజన్‌కో) పరిధిలో పలు విద్యుత్ సంస్థలు పనిచేస్తున్నాయి.మొత్తం 41.628 మిలియన్ యూనిట్ల విద్యుత్ జరుగుతుంటే అందులో అత్యధిక భాగం బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ సంస్థలదే. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు అత్యంత కీలకం. అంధ్రప్రదేశ్ కి సొంత బొగ్గుగనులు లేకపోవటంతో ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి అంధ్రప్రదేశ్ బొగ్గు దిగుమతి చేసుకుంటున్నది. బొగ్గు గనులు కేటాయించాలని 2019 వైసీపీ ప్రభుత్వ ప్రధాని మోదీకి లేఖ రాసినా ఇప్పటికీ స్పందనలేదు. రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరం మేరకు బొగ్గు నిరంతరం లభించక వాటి సామర్థ్యం మేరకు విద్యుత్ ఉత్పత్తి చేయలేక పోతున్నాయి. ఫలితంగా అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయటం, విద్యుత్ చార్జీలు పెంచటం రాష్ట్ర ప్రభుత్వాల విధానంగా ఉంది. ఇది ప్రజలపై ఆర్థికభారం వేయటమే. బొగ్గు దిగుమతి : దేశ అవసరాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నా, వాటిని తవ్వి తీయకుండా మోదీ నాయకత్వాన ఉన్న కేంద్ర ప్రభుత్వం థర్మల్ విద్యుత్ సంస్థలకు బొగ్గు కొరతను సృష్టించింది. బొగ్గు కొరత పేరుతో విదేశాల నుంచి పెద్దఎత్తున దిగుమతులు చేసుకుంటున్నది. ఈ దిగుమతులపై ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ అనేక అనుమానాలు వ్యక్తం చేసింది. ఆ మేరకు ప్రకటన కూడా చేసింది. బొగ్గు దిగుమతుల ద్వారా కొన్ని సంస్థలు అనుచిత లబ్ధి పొందుతున్నాయని, అంతర్జాతీయ మార్కెట్లో బొగ్గు ధర పెరుగుతుందని అభిప్రాయ పడింది. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ చట్టం 2003 కింద అసాధారణ అధికారాలు ఉపయోగించి దిగుమతి బొగ్గును తప్పనిసరిగా కొనుగోలు చేయాలని రాష్ట్రాలకు ఆదేశాలు ఇవ్వటం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని పేర్కొంది. దిగుమతి బొగ్గు ఆధారంగా పనిచేసే విద్యుత్‌ప్లాంట్లు పూర్తి సామర్థ్యంతో పని చేయాలని ఆదేశాలు ఇవ్వటం, దేశీయ బొగ్గు ఆధారిత ప్లాంట్లు దిగుమతి బొగ్గు మిశ్రమాన్ని 4 నుంచి పది శాతానికి పెంచాలని 2022లో కేంద్ర ప్రభుత్వం సూచనలు చేయటం వల్ల దిగుమతులు భారీగా పెరిగాయని ఏఐపీఈఎఫ్ పేర్కొన్నది. 2022 జూన్‌లోపు విదేశీ బొగ్గు కొనుగోలు చేయకపోతే, దేశీయ బొగ్గు సరఫరాలో 15% కోత విధిస్తామని విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు మోదీ ప్రభుత్వం హెచ్చరిక చేసింది. బొగ్గు వినియోగంలో మోదీ ప్రభుత్వ నిబంధనలు విద్యుత్ సంస్థలపై ఆర్థిక భారం పడి నష్ట పోతున్నాయి.



విదేశీ బొగ్గు వినియోగం గురించి విద్యుత్ సంస్థలకు మోదీ ప్రభుత్వం చేసిన హెచ్చరికలన్నీ ఆయన ఆత్మీయ మిత్రుడు అదాని కోసమే. ఎందుకంటే విదేశాల నుంచి అత్యధికంగా భారతదేశానికి బొగ్గు దిగుమతి చేస్తున్న కంపెనీ అదాని గ్రూపే. దీనికి అనేక దేశాల్లో బొగ్గు గనులున్నాయి. బొగ్గును సరఫరాచేసే ప్రైవేట్ రైల్వే ర్యాక్స్ వ్యవస్థ కూడా అదాని గ్రూపుకి ఉంది. సింగరేణి సంస్థ తెలంగాణ థర్మల్ విద్యుత్ సంస్థలకు టన్ను బొగ్గును 4వేల లోపు ఇస్తుంటే, అదాని గ్రూపు టన్ను బొగ్గు ధర రూ.24,500. ఈ ధరకు 31 లక్షల టన్నుల బొగ్గును విదేశాల నుంచి దిగుమతి కోసం అదాని గ్రూపుతో జగన్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఇది విద్యుత్ సంస్థలపై పెనుభారంగా మారింది. బొగ్గు కొనుగోలు చేయటానికి ప్రభుత్వ సంస్థల అప్పులు చేస్తున్నాయి. అధిక ధరలకు కరెంట్ కొనుగోలు చేయటం పెద్ద కంపెనీల నుంచి విద్యుత్ బకాయిలు వసూలు చేయలేక పోవటం, ప్రభుత్వ పెద్దల, నిరంకుశ అధికారుల అవినీతి విద్యుత్ సంస్థల నష్టాలకు, అప్పులకు కారణం. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలి. ప్రభుత్వాలు చేసిన అప్పులనుతీర్చే బాధ్యత ప్రభుత్వాలే వహించాలి. అందుకు ప్రజలపై భారం వేయకూడదు. సబ్సిడీల బకాయలను ప్రభుత్వం చెల్లించి, పెద్ద మొత్తంలో సంస్థలకు రావాల్సిన బకాయిలు రాబట్టారు. కరెంట్‌చౌర్యాన్ని, అధికారుల అవినీతిని అరికట్టడం, దిగుమతులనుఆపి, పూర్తిగా దేశీయ బొగ్గును వినియోగిస్తే విద్యుత్ సంస్థల అప్పులు తీర్చవచ్చు. ఇలాంటి విధానాలు చేపట్టకుండా, ప్రజలపై సర్దుబాటు చార్జీల భారం వేయడం ప్రజా వ్యతిరేకం. రాష్ట్ర ప్రజలు దీన్ని వ్యతిరేకించాలి.

సెల్:9885983526

అమెరికా చెంతకు ఉచిత పథకాలు

ట్రంప్ హామీపై కేజ్రీవాల్ పోస్టు వైరల్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైతే విద్యుత్ ఛార్జీలు సగానికి తగ్గిస్తానంటూ డొనాల్డ్ ట్రంప్ హామీ ఇవ్వడంపై ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. ట్రంప్ పోస్టును రీట్వీట్ చేస్తూ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. 'అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత 12 నెలల్లో ఇంధన, కరెంట్ బిల్లులు సగానికి తగ్గిస్తా. మన విద్యుత్ సామర్థ్యాన్ని రెట్టింపు చేసేలా చర్యలు తీసుకుంటా. దీంతో ద్రవ్యోల్బణం తగ్గుతుంది. ఈ చర్యల వల్ల అమెరికా... ముఖ్యంగా మిచిగాన్‌లో వ్యాపార అవకాశాలు పెరుగుతాయి" అని 'ఎక్స్' వేదికగా ట్రంప్ ప్రకటించారు. దీనిపై కేజ్రీవాల్ స్పందిస్తూ 'విద్యుత్ బిల్లులు సగానికి తగ్గిస్తానని ట్రంప్ ప్రకటించారు. ఉచిత తాయిలాలు అమెరికా దాకా వెళ్లాయి' అని పేర్కొన్నారు. దేశ రాజధాని నగరం ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆప్ ప్రభుత్వం ఉచిత కరెంటు పథకాన్ని అమలు చేస్తోంది. అలాగే ఎన్నికల సమయంలో కొన్ని పార్టీలు కూడా ఈ తరహా ప్రకటనలు చేయగా... ఈ హామీల ప్రభావం గెలుపుపై చూపిన సందర్భాలున్నాయి. ఇటీవల అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో ఉచిత విద్యుత్ అమలు చేస్తే... ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తాను మోదీ తరపున ప్రచారం చేస్తానని వ్యాఖ్యానించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు అంటే ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అవినీతి అని ప్రజలకు అర్థమైందన్నారు.

కుల గణనపై ఆర్ఎస్ఎస్ యూటర్న్

జైపూర్: లోక్‌సభ ఎన్నికల నుంచి హర్యానా అసెంబ్లీ వరకూ ఎన్నికల ప్రచారంలో కులగణన అంశాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాన ఎన్నికల అస్త్రంగా ఉపయోగిస్తున్నారు. ఈ వాదనను బీజేపీ కొట్టివేస్తూ హిందువులను విభజించేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారని ఎదురుదాడి చేస్తోంది. ఈ చర్చ నేపథ్యంలో బీజేపీ మాతృసంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) 'హిందువుల మధ్య ఐక్యత' దిశగా పావులు కదుపుతోంది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో సంఘ్ నేత సురేశ్ భయ్యాజీ జోషి మాట్లాడుతూ పుట్టుక ఆధారంగా కుల నిర్ధారణ జరుగుతుందని, అంతమాత్రాన అది మనలను వేరుచేయదని అన్నారు. 'మనకు పేర్లు, భాషలు, దేవుళ్లు, మత గ్రంథాలు ఉన్నాయి. గొప్ప గొప్ప వ్యక్తుల వారసులమని అనిపించుకుంటాం. వీటికి కులంతో సంబంధం ఏమిటి? ఉందని ఎవరైనా అంటారా? హరిద్వార్ ఏ కులానికి చెందింది? 12 జ్యోతిర్లింగాలు ఏ కులానికి చెందినవి? దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 51 శక్తి పీఠాలు ఫలానా కులానికి చెందినవని చెప్పగలమా?' అని భయ్యాజీ ప్రశ్నించారు. తమను తాము ఎవరైతే హిందువులుగా భావిస్తుంటారో వారు ఈ మత ప్రాంతాలను తమవిగా భావిస్తుంటారని, ఇక విభజన అనేది ఎక్కడుందని ఆయన ప్రశ్నించారు. పుట్టుక ఆధారంగా విభజన ఉండదన్నారు. ఇందులో ఎలాంటి గందరగోళానికి, అనవసర రాద్ధాంతానికి తావు లేదని భయ్యాజీ జోషి వివరించారు. కులగణనకు ఆర్ఎస్ఎస్ గతంలో షరతులతో కూడిన మద్దతు ప్రకటించింది. ప్రజాసంక్షేమం కోసం కులగణన జరగాలే కానీ రాజకీయ ప్రయోజనాలు ఆశించి కాదని చెప్పింది.

ఆప్ మద్దతు ఎన్‌సీకే...

ఎల్జీకి లేఖ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమవుతున్న నేషనల్ కాన్ఫరెన్స్‌కు ఆమ్ ఆద్మీ పార్టీ అధికారికంగా మద్దతు ప్రకటించింది. ఒమర్ అబ్దుల్లా సారథ్యంలోని ప్రభుత్వానికి తాము మద్దతిస్తున్నట్టు పేర్కొంటూ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) కార్యాలయానికి ఆ పార్టీ ఒక లేఖ అందించింది. ఇటీవల వెలువడిన జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో దోడా నియోజకవర్గం నుంచి 'ఆప్' అభ్యర్థి మెహ్రాజ్ మాలిక్ గెలుపొందారు.

నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఇప్పటికే ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన బలాన్ని సమకూర్చుతుంది. సొంతంగా 42 సీట్లలో ఎన్‌సీ గెలుపొందగా, భాగస్వామ్య పార్టీగా ఉన్న కాంగ్రెస్ ఆరు, సీపీఎం ఒక సీటు గెలుచుకున్నాయి. దీంతో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మెజారిటీని ఎన్‌సీ-కాంగ్రెస్ కూటమి దక్కించుకుంది. దీనికి తోడు స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన ఏడుగురిలో నలుగురు ఎన్‌సీకి మద్దతు ప్రకటించారు. తాజాగా ఆప్ సైతం ఎన్‌సీకి మద్దతు తెలిపింది. నేషనల్ కాన్ఫరెన్స్ లెజిస్లేటివ్ గ్రూప్ నేతగా ఒమర్ అబ్దుల్లా ఎన్నికైనట్టు ఆ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ప్రకటించారు.

దీంతో ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా ఎల్జీని కోరేందుకు ఎన్‌సీ సన్నద్ధమవుతోంది.

ఎన్‌డీఏకు మద్దతు ఉపసంహరించాలి

నితీశ్‌కుమార్‌కు అఖిలేశ్ యాదవ్ డిమాండ్

లక్నో: జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమం నుంచి ఉద్భవించిన నితీశ్ కుమార్ పార్టీ జేడీ(యూ) బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించాలని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలోని సోషలిస్ట్ నేత జయప్రకాశ్ నారాయణ్ ఇంటర్నేషనల్ సెంటర్ (జేపీఎన్ఐసీ)ను సందర్శించేందుకు గురువారం రాత్రి ఆయన ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో శుక్రవారం జేపీ జయంతి సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి అఖిలేశ్ అక్కడకు చేరుకున్నారు. వాహనంపై ఏర్పాటు చేసిన జేపీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ వ్యవహారం ప్రతిపక్ష పార్టీ, బీజేపీ మధ్య తాజా పోరుకు కేంద్రంగా మారింది. ఈ సందర్భంగా అఖిలేశ్ మాట్లాడుతూ జేపీ నారాయణ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేయకుండా, ఉదయం ఇక్కడ విక్రమాదిత్య మార్గ్‌లోని తన ఇంటి దగ్గర 'సమాజ్‌వాదీలు' ఆ ప్రాంతాన్ని సందర్శించకుండా నిరోధించడానికి బారికేడ్లు వేసినందుకు రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఎన్‌డీఏ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'జయప్రకాశ్ నారాయణ్ జయంతిని జరుపుకోవడానికి జేపీఎన్ఐసీ మ్యూజియానికి మేము వెళుతున్నాం. కానీ ఈ ప్రభుత్వం మమ్మల్ని ఎందుకు అడ్డుకుందో నాకు తెలియదు. బీజేపీ చేసిన ఈ దిగ్బంధం మొదటిది కాదు. ఇది అన్ని మంచి పనులను అడ్డుకుంది' అని అఖిలేశ్ అన్నారు. ఈరోజు రోడ్డుపై నిలబడి 'జన్‌నాయక్'కు నివాళులు అర్పిస్తున్నామని చెప్పారు. జేపీఎన్ఐసీని సందర్శించకుండా ఎస్పీ కార్యకర్తలను వెదురు బారికేడ్లు ఆపలేవని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అన్నారు. 'చాలా మంది సోషలిస్టులు ఎన్డీయే ప్రభుత్వంలో ఉన్నారు. ఆ ప్రభుత్వం కొనసాగడానికి సహాయం చేస్తున్నారు. నితీశ్ కుమార్, ఆయన పార్టీ జేపీ ఉద్యమం నుంచి ఉద్భవించారు. జేపీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పించేందుకు సోషలిస్టులను అనుమతించని ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవడానికి నితీశ్ కుమార్‌కు ఇది ఒక మంచి అవకాశం' అని అన్నారు. సమాజ్‌వాదీలు ఆయనకు (జేపీ) గౌరవం ఇచ్చారని, అలాగే కొనసాగుతారని చెప్పారు. జేపీఎన్ఐసీలోని స్మారక చిహ్నాన్ని 'అమ్మే కుట్ర' కారణంగా కప్పిపుచ్చారని యూపీ మాజీ ముఖ్యమంత్రి ఆరోపించారు. 'ఒక మ్యూజియాన్ని విక్రయించాలనుకునే ప్రభుత్వం ఉందని ఊహించుకోండి' అని అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న తన ఇంటి దగ్గర బారికేడ్లతో పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో సహా భద్రతా సిబ్బందిని మోహరించిన వీడియో దృశ్యాలు, చిత్రాలను యాదవ్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'బీజేపీ వారైనా, వారి ప్రభుత్వమైనా... వారి ప్రతి చర్య ప్రతికూలతకు ప్రతీక. గతసారి మాదిరిగానే జేపీ నారాయణ్‌జీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సమాజ్‌వాదీ ప్రజలు పూలమాల వేయకుండా ఉండేందుకు మా వ్యక్తిగత నివాసం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు' అని 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. సామరస్యం, శాంతి, రిజర్వేషన్లు, రైతుల సంక్షేమం, మహిళా భద్రత, యువత అభివృద్ధి, ఉపాధి కల్పన, వెనుకబడిన, దళితులు, అల్పసంఖ్యాక వర్గాల అభివృద్ధికి బీజేపీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. స్వాతంత్ర్య సమరయోధులు, స్వాతంత్ర్య ఉద్యమానికి బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకమని, వలసవాద శక్తుల నుంచి నేర్చుకుని రహస్యంగా వారికి మద్దతిచ్చారని, ఈ రోజు అందరూ తమకు బీజేపీ వద్దు అని చెబుతున్నారని అఖిలేశ్ పేర్కొన్నారు. ఈ అంశంపై సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత శివపాల్ సింగ్ యాదవ్ కూడా రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. 'అధికారం మత్తులో ఉన్న బీజేపీ ప్రజాస్వామ్యాన్ని కాలరాయాలనుకుంటోంది. అధికార వ్యవస్థ ప్రజలపై ఎప్పటికీ నెగ్గదు. ప్రభుత్వం గతం నుంచి గుణపాఠం నేర్చుకోవాలి. ప్రజాస్వామ్యంలో నియంతృత్వం ఎక్కువ కాలం సాగదు' అని 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. అయితే జేపీఎన్ఐసీలో పనులు జరుగుతున్నందున భద్రతా కారణాల అఖిలేశ్‌ను అనుమతించలేదని అధికారులు వివరించారు. గత ఏడాది కూడా అఖిలేశ్ నేతృత్వంలోని ఎస్పీ ప్రభుత్వం ఆవరణలో ఏర్పాటు చేసిన జేపీ నారాయణ్ విగ్రహానికి పూలమాల వేయడానికి జేపీఎన్ఐసీ గేటుపైకి ఎక్కవలసి వచ్చింది.

మహాయుతిలో తారస్థాయికి విభేదాలు

షిండేతో అజిత్ పవార్ వాగ్వాదం

కేబినెట్ భేటీ నుంచి వాకౌట్

ముంబై: మహారాష్ట్రలోని అధికార కూటమి 'మహాయుతి'లో విభేదాలు తారస్థాయికి చేరినట్లు కనిపిస్తోంది. కూటమిలో లుకలుకలు బహిరంగంగా వెలుగుచూస్తున్నాయి. కూటమిలో వైరుధ్యాలపై ఇప్పటికే అనేకసార్లు వార్తలు వచ్చాయి. తాజాగా ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు జాతీయ మీడియా కథనం పేర్కొంది. దీంతో పవార్ కేబినెట్ సమావేశం నుంచి మధ్యలోనే బయటకు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. త్వరలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఓటర్లను ఆకట్టుకునేలా, వేగంగా ప్రజల్లోకి వెళ్లేలా ఉన్నటువంటి కొన్ని పథకాలకు సంబంధించి ప్రతిపాదనలను ముఖ్యమంత్రి కేబినెట్ భేటీలో సభ్యుల ముందు ఉంచారు.

వాటిలో కొన్నింటిని అజిత్ పవార్ వ్యతిరేకించారని, ఇద్దరి మధ్య తీవ్రవాగ్వాదం చోటుచేసుకుందని సమాచారం. దాంతో అసహనం వ్యక్తం చేస్తూ అజిత్‌పవార్ బయటకు వెళ్లడంతో సమావేశంలో ఉన్నవారంతా ఆశ్చర్యపోయారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పవార్‌ల కుటుంబం కీలకంగా భావించే బారామతి ప్రాంతానికి సంబంధించిన ప్రతిపాదన విషయంలోనే అజిత్ నుంచి వ్యతిరేకత వచ్చినట్లు తెలుస్తోంది. ఒకవైపు, షిండే నాయకత్వంలోనే తాము ఎన్నికలకు వెళతామని కూటమి నేతలు ప్రకటనలు చేస్తున్న సమయంలో... ఈ వార్తలు కూటమిలో చిచ్చును బయటపెడుతున్నాయి. ఈ కథనాలపై అజిత్ పవార్ స్పందించారు. తమ మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవంటూ చెప్పుకొచ్చారు. 'సమావేశం ప్రారంభమైన 10 నిమిషాల్లోపే నేను బయటకువెళ్లలేదు. షిండే, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అనుమతితోనే కొద్దిసేపటి తర్వాత బయటకువచ్చాను.

ముందస్తు షెడ్యూల్ ప్రకారం నా విమాన ప్రయాణం నిమిత్తం వచ్చేశాను' అని వివరణ ఇచ్చారు. షిండేతో అభిప్రాయభేదాల అంశంపై వచ్చిన వార్తలపై మాత్రం ఆయన స్పందించలేదు.

పోరాటానికి సిద్ధం

మహారాష్ట్ర సీఎం షిండే

ముంబై : రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో అధికార మహాయుతి పోరాటానికి సిద్ధంగా ఉందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే శుక్రవారం అన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో తన భాగస్వామి బీజేపీ చారిత్రాత్మక విజయం నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాయ్‌గఢ్ జిల్లాలోని ఉల్వే వద్ద రాబోయే నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఐఏఎఫ్ విమానం ట్రయల్ ల్యాండింగ్‌ను చూసిన తర్వాత మీడియాతో ప్రసంగించిన ఆయన, పేర్కొన్న గడువు మార్చి 31, 2025 కంటే ముందే విమానాశ్రయం నుంచి వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించడానికి తమ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. 'ఈరోజు, నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలోని రన్‌వే వద్ద భారత వైమానిక దళానికి చెందిన సీ295 విమానం విజయవంతంగా ల్యాండింగ్ అయింది. మేము ఇప్పుడు ఈరోజు 'ఫ్లైట్, ఫైట్' కు రెండింటికీ సిద్ధంగా ఉన్నాం' అని షిండే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల గురించి స్పష్టమైన సూచనలో తెలిపారు. రవాణా విమానం సి295 దక్షిణ రన్‌వే 26 వద్ద మధ్యాహ్నం 12.14 గంటలకు దిగింది. అదానీ గ్రూప్ అభివృద్ధి చేస్తున్న ఈ విమానాశ్రయం వచ్చే ఏడాది ప్రారంభంలో వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించనుంది. గ్రీన్‌ఫీల్డ్ నవీ ముంబై విమానాశ్రయం అధిక సామర్థ్యం కలిగినది. దేశంలోని అతిపెద్ద విమానయాన సౌకర్యాలలో ఒకటిగా ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సదుపాయాన్ని ప్రజలకు పెద్ద బహుమతిగా పేర్కొన్న షిండే, దీనిని ప్రారంభించిన తర్వాత ముంబై విమానాశ్రయంలో రద్దీ గణనీయంగా తగ్గుతుందని ఆయన నొక్కి చెప్పారు.

ప్రాంతీయ పార్టీలతో పొత్తులుండవు

- ఎన్‌డీఏ... 'ఇండియా' కూటమిలకు దూరం
- బీఎస్పీ అధినేత్రి మాయావతి

లక్నో : బీఎస్పీ అధినేత్రి మాయావతి శుక్రవారం తమ పార్టీ ఉత్తర ప్రదేశ్‌లో లేదా మరే ఇతర రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలతో పొత్తులు పెట్టుకోదని, మునుపటి భాగస్వామ్యాల నుంచి సంతృప్తికరమైన ఫలితాలను చూపలేదని, అలాగే బీజేపీ, కాంగ్రెస్ నేతృత్వంలోని ఎన్‌డీఏ, 'ఇండియా' కూటమిలకు దూరం కొనసాగుతుందని ప్రకటించారు. 'హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, ముందస్తు పంజాబ్ ఎన్నికల చేదు అనుభవం' దృష్ట్యా సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాలుగుసార్లు ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అయిన ఆమె సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఉత్తర ప్రదేశ్, ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల సమయంలో బీఎస్పీ తన ఓట్లను కూటమి భాగస్వాములకు స్థిరంగా బదిలీ చేసింది, అయితే ఈ భాగస్వాములు పరస్పరం స్పందించలేకపోవడం నిరాశాజనక ఫలితాలకు దారితీసింది. ఇది పార్టీ కార్యకర్తలను నిరుత్సాహపరిచింది. పార్టీ ఉద్యమాన్ని దెబ్బతీసింది' అని ఆమె పేర్కొన్నారు. 'ఉద్యమం' మరింత నిరాశ, నష్టం నుంచి పార్టీ కార్యకర్తలను రక్షించడం చాలా ముఖ్యం అని ఆమె పేర్కొన్నారు. 'అంబేద్కరిస్టు విలువలకు' ప్రాతినిధ్యం వహిస్తున్న 'ఏకైక పార్టీ' బీఎస్పీ అని, కులతత్వ శక్తులు దానిని బలహీనపరిచేందుకు ప్రయత్నించినప్పటికీ... 'బహుజన సమాజం' సాధికారత కోసం కట్టుబడి ఉందని తెలిపారు.

'బీఎస్పీ స్వార్థ ప్రయోజనాల కోసం ఇతర పార్టీలతో లేదా నాయకులతో విలీనం కోసం ఏర్పాటు చేసిన సంస్థ కాదు. బదులుగా, ఇది బహుజన సమాజ్‌లోని వివిధ విభాగాలను ఒక రాజకీయ శక్తిగా ఏకం చేసి, పరస్పర సహకారం, సౌభ్రాతృత్వంపై నిర్మించబడి, వారిని పాలకవర్గ స్థితికి చేర్చే ఉద్యమం' అని మాయావతి పేర్కొన్నారు.

ఇచ్చిన రాజీనామా వెనక్కి...

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే బ్రిజ్ బిహారీ పటేరియా ... స్పీకర్‌కు రాజీనామా సమర్పించి ఆ తర్వాత మళ్లీ దాన్ని వెనక్కి తీసుకున్నారు. వివరాలు ఇవి... డియోరి నియోజకవర్గంలో ఓ వ్యక్తి పాము కాటుతో మృతిచెందాడు. అయితే అతడికి డెత్ సర్టిఫికేట్ ఇచ్చేందుకు ఓ డాక్టర్ లంచం డిమాండ్ చేశాడు. ఈ నేపథ్యంలో ఆ డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే గురువారం రాత్రి కేస్లీ పోలీసు స్టేషన్ ముందు నిరసన చేపట్టాడు. డిమాండ్లను పరిశీలిస్తామని హామీ ఇచ్చిన తర్వాత ఆయన ధర్నా విరమించారు. ధర్నా చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని, అందుకే ఆవేశంలో రాజీనామా చేశానని, కానీ మళ్లీ ఆ రాజీనామాను వెనక్కి తీసుకున్నట్లు ఆ ఎమ్మెల్యే తెలిపారు. ఓ పేదవాడు ఓ డాక్టర్‌పై ఫిర్యాదు ఇచ్చాడని, ఆ ఫిర్యాదుపై విచారణ చేపట్టాల్సిన బాధ్యత పోలీసులదే అని ఎమ్మెల్యే చెప్పారు. 70 ఏళ్ల వృద్ధుడి కొడుకు పాము కాటు వల్ల మరణించాడని, అతడికి మరణధృవీకరణ పత్రం ఇచ్చేందుకు ఆ డాక్టర్ రూ.40 వేల లంచం అడిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. పాము కాటుతో మృతిచెందిన కుటుంబసభ్యులకు రూ.నాలుగు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని, దాంట్లో పది శాతం ఆ డాక్టర్ లంచంగా డిమాండ్ చేసినట్లు ఎమ్మెల్యే ఆరోపించారు. పది వేలు ఇచ్చేందుకు సిద్ధమైనా ఆ డాక్టర్ అదనపు నగదు కోసం వత్తిడి చేసినట్లు తెలిపారు.

ఆగని నిరవధిక నిరాహార దీక్ష

జూనియర్ డాక్టర్ ఆరోగ్యం విషమం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆసుపత్రిలో హత్యాచార ఘటన వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జూనియర్ వైద్యులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష శుక్రవారంతో ఆరో రోజుకు చేరుకొంది. ఈ దీక్షలో పాల్గొన్న వైద్యుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆసుపత్రికి చెందిన వైద్యాధికారులు తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... కొందరు జూనియర్ వైద్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా అక్టోబర్ 5 సాయంత్రం నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. వారిలో అనికేత్ మహతో ఆరోగ్య పరిస్థితి క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. దీంతో గురువారం రాత్రి అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆ వైద్యుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు చెప్పారు. అతడి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడానికి ఐదుగురు సభ్యులతో కూడిన మెడికల్ బోర్డును ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడే నిరాహార దీక్షలో పాల్గొన్న మరో ఆరుగురు వైద్యుల ఆరోగ్యం కూడా క్షీణిస్తున్నట్లు జూనియర్ వైద్యులు పేర్కొన్నారు. వారికి వెంటనే వైద్యం అందించడానికి దీక్ష ప్రాంతంలో ఐసీయూ అంబులెన్స్, ఇతర వైద్య పరికరాలు ఏర్పాటుచేశామన్నారు. తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పరిష్కరించేవరకు నిరాహార దీక్ష కొనసాగుతుందని ఆందోళనకారులు పునరుద్ఘాటించారు. దీక్షలో పాల్గొన్న వైద్యుల్లో ఎవరికి ఏం జరిగినా దానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే నార్త్ బెంగాల్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మరో ఇద్దరు జూనియర్ వైద్యులు కూడా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లుగా అక్కడి వైద్యులు తెలిపారు. జూనియర్ వైద్యుల ఆరోగ్య పరిస్థితిపై సీనియర్ వైద్యులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 'ఈ యువ వైద్యులే మన భవిష్యత్తు. వీరు న్యాయం కోసం నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తోంది. పరిస్థితి చేయి దాటేలోపే అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలి' అని ఓ సీనియర్ డాక్టర్ బెంగాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శాంతి పునరుద్ధరణకు కృషి

ప్రపంచ దేశాలకు మోదీ పిలుపు

న్యూఢిల్లీ: యురేషియాతోపాటు పశ్చిమాసియాలో శాంతిసుస్థిరతను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించాలని ప్రపంచ దేశాలకు భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆయా దేశాల్లో జరుగుతున్న ఘర్షణలు... గ్లోబల్ సౌత్ దేశాలపై అత్యంత ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వియత్నాంలో జరిగిన 19వ తూర్పు ఆసియా సదస్సులో నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ ఈ ఘర్షణలు నివారించేందుకు ప్రయత్నించాలని ప్రపంచదేశాలకు సూచించారు. తాను బుద్ధుడు జన్మించిన దేశం నుండి వచ్చానన్నారు. యుద్ధరంగంలో సమస్యలకు పరిష్కారాలు మాత్రం దొరకవని మోదీ స్పష్టం చేశారు. సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతతోపాటు అంతర్జాతీయ చట్టాలను గౌరవించాల్సి ఉందన్నారు. చర్చలకు, దౌత్యానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. ఆ క్రమంలో విశ్వబంధు భారత్... అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని ఆయన తెలిపారు. ఆ ప్రాంతంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. తమ పక్కనే ఉన్న మైన్మార్‌తో భారత్ కలిసి నడుస్తుందన్నారు. పొరుగుదేశం భారత్... తన బాధ్యతను కొనసాగిస్తుందని మోదీ పేర్కొన్నారు. భారత్ యాక్ట్ ఈస్ట్ పాలసీలో తూర్పు ఆసియా సదస్సు అత్యంత ముఖ్యమైనదని మోదీ గుర్తు చేశారు. కాగా, ఇజ్రాయిల్, లెబనాన్, ఇరాన్ దేశాల మధ్య పోరు రోజు రోజుకు తీవ్రతరమవుతోంది. అనేక దేశాల మధ్య సంబంధాలు ఉప్పు నిప్పు తరహాలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం లండన్ వేదికగా జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ జ్యూరిట్స్ అండ్ రైటర్స్ ఫర్ వరల్డ్ పీస్ స్పందించింది. ఈ ఘర్షణలను నిలుపుదల చేసేందుకు శాంతి దౌత్యం జరపాలని ప్రధాని మోదీకి ప్రపంచ సదస్సులో పాల్గొన్న ప్రముఖులు విజ్ఞప్తి చేశారు. అందుకోసం వెంటనే రంగంలోకి దిగాలని వారు సూచించారు. లేకుంటే మూడో ప్రపంచ యుద్ధం వచ్చే అవకాశముందని వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

చెన్నై, పుదుచ్చేరిలో భారీ వర్షాలు

లోతట్టు ప్రాంతాలు జలమయం... జలదిగ్బంధంలో ప్రభుత్వాసుపత్రి

చెన్నై: భారీ వర్షాల కారణంగా తమిళనాడు డెల్టాప్రాంతంలో ఎనిమిది జిల్లాలకు వాతావరణ శాఖ (ఐఎండీ) ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. చెన్నై, పుదుచ్చేరి సహా ఆరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ఇచ్చారు. పుదుచ్చేరిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రభుత్వాస్పత్రి జలదిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో రోగులను మరో ఆస్పత్రికి అధికారులు తరలించారు. రోడ్లపై వరద నీరు చేరి చెన్నై-పుదుచ్చేరి మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సేలం జిల్లాలో సబ్‌వేలో వరద నీరు నిలిచింది.

మరో ఆరు రోజులు...

ఈశాన్య రుతుపవనాల ప్రభావం కారణంగా నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు, తిరువణ్ణామలై, విల్లుపురం, కడలూరు, మైలాడుదురై, తంజావూరు, తిరువారూరు, నాగపటిట్నం జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. కన్యాకుమారి కడలిలోను, అరేబియా సముద్రతీరం, శ్రీలంక, దాని చుట్టూ ఉన్న ప్రాంతాల్లోనూ ఉపరితల ఆవర్తనం ఏర్పడడం, వీటికి తోడు కచ్చాదీవి, దాని చుట్టూ అరేబియా సముద్ర ప్రాంతం వద్ద అల్పపీడనం కారణంగా మరో ఆరు రోజులపాటు సేలం, కృష్ణగిరి, ధర్మపురి, తిరుపత్తూరు, నామక్కల్, కరూరు, తిరుచ్చి, మదురై, విరుదునగర్, దిండుగల్, తేని, రామనాథపురం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. సముద్రతీరాల్లో గంటకు 35 నుంచి 45 కి.మీ. వేగంతో పెనుగాలులు వీస్తాయని హెచ్చరికలు జారీ చేశారు. ఇదిలా ఉండగా... ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం కార్పొరేషన్ జోన్ల వారీగా స్థానికులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిస్తే ఎక్కువగా వరదలు సంభవించే ప్రాంతాల వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు.

ఫైరింగ్ ప్రాక్టిస్‌లో విషాదం.. ఇద్దరు అగ్ని వీరుల మృతి

ముంబై: మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా ఆర్టిలరీ కేంద్రంలో విషాదం చోటు చేసుకుంది. ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో ఇండియన్ ఫీల్డ్ గన్ నుంచి షెల్ పేలడంతో ఇద్దరు అగ్నివీరులు మరణించినట్టు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. బుల్లెట్లు దూసుకుపోవడంతో అగ్నివీరులు.. గోహిల్ విశ్వరాజ్ సింగ్ (20), సైఫత్ షిత్ (21) మృతి చెందినట్లు వివరించారు. అగ్నివీర్‌ల బృందం ఇండియన్ ఫీల్డ్ గన్‌తో కాల్పులు జరుపుతుండగా అందులోని షెల్ ఒకటి పేలిపోయింది.

దీంతో ఇద్దరు అగ్నివీరులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని డియోలాలిలోని ఎంహెచ్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే వారు మృతిచెందనట్లు డాక్టర్లు ధృవీకరించారు. హవల్దార్ అజిత్ కుమార్ ఫిర్యాదు మేరకు డియోలాలి క్యాంపు పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హర్యానా ఎమ్మెల్యేల్లో 96 శాతం మంది కోటీశ్వరులే

రూ.270 కోట్లతో అగ్రస్థానంలో సావిత్రి జిందాల్

చండీగఢ్: ఇటీవల జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేల్లో 96 శాతం మంది కోటీశ్వరులే ఉన్నారు. 13 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విశ్లేషణలో ఈ విషయం వెల్లడైంది. ఎన్నికల్లో గెలుపొందిన 90 మంది అభ్యర్థుల అఫిడవిట్లను పరిశీలించింది. ఎన్నికల్లో గెలుపొందిన కోటీశ్వరుల ఎమ్మెల్యేల సంఖ్య గత ఎన్నికలతో పోలిస్తే మూడుశాతం పెరిగింది. 86 మంది ఎమ్మెల్యేలు కోటీశ్వరులు ఉన్నారు. 90 మందిలో 44 శాతం మందికి రూ.10 కోట్లకంటే ఎక్కువగా ఆస్తులున్నాయి. కేవలం 2.2 శాతం మందికి మాత్రమే రూ.20 లక్షలలోపు ఆస్తులున్నట్లుగా తేలింది. 14 శాతం మంది మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీలోకి అడుగుపెట్టనున్నారు. 2019తో పోలిస్తే పదిశాతం ఎక్కువగా ఉన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ 48 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్ 37 సీట్లు గెలుచుకున్నది. ఆమ్ ఆద్మీ పార్టీకి ఘోర పరాభవం ఎదురైంది. ఐఎన్ఎల్‌డీకి కేవలం రెండు మాత్రమే వచ్చాయి. 96 శాతం బీజేపీ, 95 శాతం కాంగ్రెస్, ఐఎన్ఎల్‌డీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు వందశాతం తమకు రూ.కోటి కంటే ఎక్కువగా ఆస్తులు ఉన్నట్లు ప్రకటించారు. హిసార్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన సావిత్రి జిందాల్ రూ.270 కోట్ల ఆస్తులతో అగ్రస్థానంలో ఉన్నారు. రూ.145 కోట్లతో బీజేపీకి చెందిన శక్తి రాణిశర్మ, రూ.134 కోట్ల ఆస్తులతో శృతి చౌదరి ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. తిరిగి ఎన్నికైన ఎమ్మెల్యేల ఆస్తులు 59 శాతం పెరిగాయి.

ఈసారి ఎన్నికల్లో 30 మంది ఎమ్మెల్యేలు మరోసారి గెలిచి అసెంబ్లీలోకి అడుగుపెట్టనున్నారు. 2019 నుంచి వారి సగటు ఆస్తులు 59 శాతం పెరిగాయి. గతంలో రూ.9.08 కోట్లు ఉండగా... ఇప్పుడు రూ.14.46 కోట్లకు ఆస్తులు పెరిగాయి. క్రిమినల్ కేసుల్లోనూ స్వతంత్రులు అగ్రస్థానంలో ఉన్నారు. 12 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అందులో ఆరుగురిపై తీవ్రమైన అభియోగాలు ఉన్నాయి. ఒకరిపై హత్యాయత్నం కేసు ఉన్నది.

చెడుపై మంచి గెలవడమే దసరా

తెలుగు ప్రజలకు

చంద్రబాబు శుభాకాంక్షలు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విజయదశమి పర్వ దినాన్ని పురస్కరించుకుని తెలుగు ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుభాకాంక్షలు తెలిపారు. 'ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లేలా చూడాలని ఆ కనకదుర్గమ్మ తల్లిని వేడుకుంటున్నాను. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించుకునే దసరా పండుగ, మన జీవితాల్లో కొత్త వెలుగు నింపాలని ఆకాంక్షిస్తున్నాను. దుష్ట సంహారం తర్వాత శాంతి, సౌభ్రాతృత్వంతో అందరూ కలిసి మెలిసి జీవించాలన్నదే దసరా పండుగ సందేశం. ఇదే స్ఫూర్తితో శాంతియుత, అభివృద్ధికారక సమాజం కోసం కృషి చేద్దాం. శక్తి ఆరాధనకు ప్రాధాన్యతనిచ్చే ఈ పండుగ దినాల్లో అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని తొమ్మిది అవతారాల్లో దర్శించుకున్నాం. మరోవైపు ఆ దేవదేవుడైన తిరుమల శ్రీ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుపుకున్నాం. ఇదే ఒరవడితో సర్వజన సంక్షేమాన్ని కొనసాగిద్దాం. మరొక్కమారు అందరికీ మనస్ఫూర్తిగా దసరా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా' అంటూ సీఎం ట్వీట్ చేశారు.

మన దళాలపై ఇజ్రాయిల్ దాడులు

భారత్ ఆందోళన

న్యూఢిల్లీ: బీరుట్‌లోని ఐరాస శాంతి పరిరక్షణ దళాలు ఉన్నచోట ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేస్తుండటంతో అక్కడ నెలకొన్న తాజా పరిస్థితులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఐరాస శాంతి పరిరక్షణ దళాల్లో మన సైనికులు పనిచేస్తున్న వేళ ఈ వ్యవహారంపై భారత్ స్పందించింది. ఈ వివాదం ప్రాంతీయ యుద్ధంగా మారకుండా చూడటం ఎంతో ముఖ్యమని అభిప్రాయపడింది. తాజా ఉద్రిక్తతల వేళ ఇజ్రాయిల్, ఇరాన్‌తోపాటు ఇతర పశ్చిమాసియా దేశాల్లో ఉన్న భారతీయులను తరలించే ప్రక్రియ చేపట్టడం లేదని భారత విదేశాంగశాఖ తెలిపింది. దక్షిణ లెబనాన్‌లోని ఐరాస శాంతి పరిరక్షణ కార్యాలయంపై దాడులు జరగడం ఆందోళనకరమని పేర్కొంది. 'లెబనాన్ సరిహద్దులో భద్రతా పరిస్థితులు క్షీణించడం ఆందోళనకరం. పరిస్థితులను ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తున్నాం. ఐరాస ప్రాంగణాలను అందరూ గౌరవించాలి. ఐరాస శాంతి పరిరక్షకులు, ఆ సంస్థ నిర్ణయాలను గౌరవించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి' అని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. 'పశ్చిమాసియాలో నెలకొంటున్న పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఇటీవల ఓ ప్రకటన విడుదల చేశాం. అక్కడ చోటుచేసుకుంటున్న హింస, పరిస్థితులు ఎంతగానో ఆందోళన కలిగిస్తున్నాయి. సంబంధిత భాగస్వామ్యపక్షాలు సంయమనం పాటించాలని, పౌరులకు రక్షణ కల్పించాలని పునరుద్ఘాటించాం.

ఈ ఘర్షణ మరిన్ని ప్రాంతాలకు విస్తరించకూడదు. చర్చలు, దౌత్య మార్గాల్లో సమస్యను పరిష్కరించుకోవాలి' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. యునైటెడ్ నేషన్స్ ఇంటరిమ్ ఫోర్స్ ఇన్ సౌత్ లెబనాన్ శాంతిపరిరక్షణ దళాల్లో భాగంగా భారత సైన్యం కూడా దక్షిణ లెబనాన్‌లో విధులు నిర్వర్తిస్తోంది. 50 దేశాల నుంచి దాదాపు 10,500 మందితో కూడిన దళాలు యూఎన్ఐఎఫ్ఐఎల్‌లో ఉన్నాయి. ఇందులో భారత్‌కు చెందిన 900 మందితో కూడిన బెటాలియన్ అక్కడ విధుల్లో ఉంది.

ఏటా మహిళలను సత్కరించుకోవాలి

నారీశక్తిలో హోంశాఖ మంత్రి అనిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళల సేవలను గుర్తించి సత్కరించుకోవడం మహాపర్వదినంతో సమానమని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడ కృష్ణానది ఒడ్డున పున్నమి ఘాట్ వేదికగా పర్యాటక శాఖ అధ్వర్యంలో శుక్రవారం జరిగిన నారీశక్తి విజయోత్సవంలో ఆమె మాట్లాడారు. కోట్లాది మంది ప్రజల ఆశయ సాధన కోసం ముందుకు నడిచే సీఎం చంద్రబాబుకు వెనకున్న శక్తి నారా భువనేశ్వరి అని కొనియాడారు. సమాజ అభివృద్ధికి ఎన్టీఆర్ ట్రస్ట్ పేరుతో ఆమె ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని అన్నారు. విజయవాడను వరదల నుంచి సాక్షాత్తు దుర్గమ్మే కాపాడిందన్నారు. ప్రతి ఏటా ఇలాంటి ఉత్సవాలు జరగాలని సూచించారు. యావత్ మహిళా లోకానికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ, నారీ శక్తి విజయోత్సవం మహిళా లోకానికి గెలుపులాంటిదని అభివర్ణించారు. మహిళామూర్తులకు పురుషులందరూ దన్నుగా నిలవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందన్నారు. తొలుత నారీశక్తి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పరిశీలించారు. నేతన్నలు, హస్త కళాకారులతో ఆమె మాట్లాడారు. అమ్మకాలు ఎలా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. చేనేత రంగాన్ని, నేతన్నలను ఆదుకోవడానికి సీఎం చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారన్నారని చెప్పారు.

16న ఏపీ మంత్రివర్గ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశాన్ని ఈనెల 16వ తేదీన నిర్వహించనున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటా మృతితో ఈ నెల 10న జరగాల్సిన సమావేశాన్ని వాయిదా వేశారు. సీఎం చంద్రబాబు, మంత్రులు హాజరై రతన్‌టాటాకు నివాళులర్పించారు. తిరిగి మంత్రివర్గ సమావేశం 16న జరగనుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీజేశారు. ఈ మంత్రివర్గ సమావేశంలో అనేక కీలకమైన అంశాలపై చర్చ జరగనుంది. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలతోపాటు రాష్ట్రాభివృద్ధి అంశాలపైనా దృష్టి పెట్టనున్నారు. ప్రధానంగా దీపావళికి ఉచితంగా మూడు సిలెండర్లు తదితర హామీల అమలుకు ఆమోదముద్ర వేయనున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.